- స్టేషన్‌లోనే వివాహితపై దాడి
- హెడ్ కానిస్టేబుల్‌పై వీరంగం

రెచ్చిపోయిన రౌడీ పోలీస్!

- వలంటీర్ ఆత్మహత్య కేసులో జైలుకెళ్లిన నేపథ్యం
- పలుకుబడితో అదే స్టేషన్‌లో తిరిగి కానిస్టేబుల్‌గా నియామకం

శ్రీకాళహస్తి, మే 1: శ్రీకాళహస్తిలో ఓ పోలీసు రెచ్చిపోయాడు. అర్ధరాత్రి పోలీస్ స్టేషన్లో ఓ వివాహితపై దాడికి పాల్పడ్డాడు.అడ్డుకోబోయిన హెడ్ కానిస్టేబుల్‌పై వీరంగం చేశాడు. పోలీసుశాఖలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటన పూర్వాపరాలివి.... శ్రీకాళహస్తి సన్నిధివీధి ప్రాంతానికి చెందిన ఓ యువకుడు పట్టణంలోని ఓ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పని చేసేవాడు.స్టేషన్ తరపున ముక్కంటి ఆలయంలో ప్రోటోకాల్ దర్శనాలు చేయించేవాడు. పలుకుబడితో స్థానికంగా ఏళ్ల తరబడి పాతుకుపోయాడు.వివాహమై ఇద్దరు పిల్లలున్నప్పటికీ కొందరు యువతులతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ క్రమంలో ఒక వలంటీర్‌తో చనువు ఏర్పడింది.అలాగే ఓ వివాహితతో సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ తన తండ్రితో వెళ్లి పెళ్లి చేసుకోమంటూ ప్రాధేయపడింది. ఆ సమయంలో కానిస్టేబుల్, ఆయన కుటుంబ సభ్యులు కలిసి తండ్రి ఎదుటే తనను దారుణంగా అవమానించారంటూ రెండు పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టి ఉరేసుకుని చనిపోయింది. ఆ లేఖ ఆధారంగా ఆ కానిస్టేబుల్‌తో పాటు అతడితో సన్నిహితంగా వివాహితపై కేసు నమోదు చేశారు.ఇద్దరికీ రిమాండ్ విధించడంతో జైలుపాలయ్యారు. దీంతో కానిస్టేబుల్ కొంతకాలం సస్పెండయ్యారు.కొద్ది నెలల క్రితం అజ్ఞాతం నుంచి బయటపడ్డ అతడు మళ్లీ అదే స్టేషన్లో కానిస్టేబుల్‌గా చేరాడు.మద్యం మత్తులో మంగళవారం రాత్రి తనకు సన్నిహితురాలైన వివాహితకు ఫోన్ చేసి శ్రీరామ్ నగర్ కాలనీలోని ఆమె ఇంటివద్దకు వెళ్లాడు.ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె నేరుగా స్టేషన్‌కి వెళ్లి కానిస్టేబుల్ తీరును వివరించింది.అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించాడు.ఆమెను వెంబడిస్తూ కారులో స్టేషన్‌కు చేరుకున్న కానిస్టేబుల్ అది గమనించి రెచ్చిపోయాడు. నా మీదే కంప్లైంట్ రాసివ్వమంటావా అంటూ హెడ్ కానిస్టేబుల్‌ను బూతులు తిట్టాడు. అక్కడే కుర్చీలో కూర్చుని ఉన్న వివాహితపై దాడికి తెగబడ్డాడు.దీంతో ఆమె విలపిస్తూ ఇంటిబాట పట్టింది.ఈ ఘటనపై సీఐకి లిఖితపూర్వకంగా హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేశారు.



శృతి మించిన లోకలిజం...!

శ్రీకాళహస్తి పోలీస్ శాఖలో లోకలిజం శృతి మించిపోతోంది. నిబంధనల ప్రకారం స్థానికంగా పోలీసులకు విధులు కేటాయించకూడదు.ఒకవేళ కేటాయించినా కాలపరిమితి ముగిసిన తర్వాత తప్పనిసరిగా బదిలీ చేయాలి.ఇందులో ఏ ఒక్క నిబంధన కూడా శ్రీకాళహస్తిలో చాలామందికి అమలు కావడం లేదు. ఇలా పాతుకుపోయిన వారిలో చాలామంది చట్టవ్యతిరేక వ్యాపారాల్లో భాగస్వాములయ్యారన్న ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి.ఆర్థికంగా బలవంతులైపోయి ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయడం లేదు. కొన్ని సందర్భాల్లో అధికారులపై తిరగబడి దుర్భాషలాడిన ఘటనలు కూడా జరిగాయి. ఇంత జరుగుతున్నా ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని ఎవరూ కదపడం లేదు. కాబట్టే స్టేషన్లోనే హెడ్ కానిస్టేబుల్‌పై కానిస్టేబుల్ రెచ్చిపోయే పరిస్థితి వచ్చింది. ఇకనైనా అధికారులు రక్షకభటుల ప్రక్షాళనపై దృష్టి సారించాల్సి వుంది.

ఎన్నికల వేళ......

రూ. 7 లక్షల మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యం కేసులను పరిశీలిస్తున్న సెబ్ అధికారులు

తడ, మే 1 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దొంగచాటుగా రవాణా అవుతున్న పుదుచ్చేరి మద్యాన్ని భీములవారిపాళెం చెక్‌పోస్టులో సెబ్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం పుదుచ్చేరి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీ చేపల లారీని ఆపిన సెబ్ అధికారులు తనిఖీ చేశారు. లారీలో చేపలను లోడ్ చేసుకొని వెళ్లే ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలు పేర్చి ఉండటంతో అనుమానం వచ్చి కిందకు దింపారు. వాటి వెనుక మద్యం కేసులను గుర్తించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీలో రూ.7.40 లక్షల విలువైన సుమారు 300 కేసులు (14,400 క్వార్టర్ బాటిళ్లు) మద్యాన్ని గుర్తించారు.పట్టుబడ్డ డ్రైవర్ కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లాకు చెందిన మహ్మద్ ఫిరోజ్‌గా గుర్తించారు. విచారణలో పుదుచ్చేరిలోని గ్లోబల్ బేవరేజస్ నుంచి ఈ మద్యాన్ని తరలిస్తున్నట్లు తేలింది.నెల్లూరులోని ఓ ఐస్ ఫ్యాక్టరీ వద్దకు లారీని తీసుకెళితే అక్కడకు సంబంధిత వ్యక్తులు వచ్చి మద్యాన్ని మరో చోటకు తీసుకువెళతారని డ్రైవర్ చెప్పినట్లుగా తెలిసింది. అయితే డ్రైవర్ వద్ద ఉన్న ఫోన్ నెంబర్లను బట్టి విచారించగా లారీని సింగరాయకొండకు తీసుకువెళ్తున్నట్లు తేలింది.ఈ మద్యం కంపెనీలో మంగళవారమే తయారుచేసి వెంటనే రవాణా చేస్తున్నట్లు సమాచారం. అధికారుల దర్యాప్తులో ఈ మద్యాన్ని ఏ పార్టీ తరలిస్తోందో బయటపడే అవకాశం వుంది.





పాత పంచాయతీ భవనం - పాత పంచాయతీ భవనంలో దాచిపెట్టిన మద్యం బాటిళ్లు

పాత పంచాయతీ భవనంలో మూడు మద్యం కేసుల స్వాధీనం

- వైసీపీ దాచిపెట్టిందన్న టీడీపీ ఫిర్యాదుతో వెలుగులోకి

చంద్రగిరి, మే 1: చంద్రగిరి మండలం ఐతేపల్లె పాత పంచాయతీ భవనంలో మూడు మద్యం కేసులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పులిత్తివారిపల్లెలో పాత పంచాయతీ భవనం నిరుపయోగంగా వుండడంతో డీలర్ రేవతి అందులో ఓ గది తీసుకుని గ్రామానికి రేషన్ పంపిణీ చేస్తున్నారు. మరో గది తాళాలు పంచాయతీ కార్యదర్శి చంద్రబాబు.. ఐతేపల్లె సర్పంచ్ ఫజుల్లా భర్త అంజాన్ ఖాన్‌కు ఇచ్చారు. అయితే పాత పంచాయతీ భవనంలో మద్యం కేసులను వైసీపీ నాయకులు దాచిపెడుతున్నారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులొచ్చి సర్పంచ్ భర్త వద్ద ఉన్న తాళాలు అడిగారు. తాళాలు తనవద్దలేవని, వైసీపీ కార్యకర్త నాగరాజుకు ఇచ్చినట్లు తెలిపారు. నాగరాజు అందుబాటులో లేకపోవడంతో పోలీసుల సాయంతో తాళాలను పగలగొట్టి తనిఖీ చేశారు. మూడు మద్యం కేసులను గుర్తించారు. అందులో 144 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నాయి. ప్రభుత్వ భవనంలో అక్రమంగా మద్యం దాటి పెట్టడాన్ని టీడీపీ నాయకులు చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి నిశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే.. వైసీపీ సర్పంచ్ భర్త ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలకు ఇవ్వడానికి మద్యం దాచిపెట్టినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పాకాల ఎక్సైజ్ సీఐ శ్రీహరి రెడ్డి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరు దాచిపెట్టారో దర్యాప్తులో తేలాక వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు.


అపార్టుమెంటులో చీరలు,నగదు సీజ్

తిరుపతి(నేరవిభాగం) మే 1 : ఓటర్లకు పంపిణీ చేసేందుకు దాచిపెట్టిన రూ.23 వేల విలువ చేసే 46 చీరలను, రూ 1.22 లక్షల నగదును బుధవారం తిరుపతి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యూనివర్శిటీ సీఐ మురళీకృష్ణ కథనం మేరకు...తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని మిథిన్ అపార్టుమెంటులో కాపురమున్న సురేష్‌బాబు ఇంటిలో చీరలు, నగదు దాచివుంచారని సమాచారం అందింది. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అపార్టుమెంటులో తనిఖీలు చేసి 46 చీరలను, రూ.1.22 లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.అపార్టుమెంట్ యజమాని సురేష్‌బాబుతో పాటు విజయకుమార్, సత్యవతి అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



సీజ్ చేసిన చీరలు, నగదు

నిప్పుల కుంపటి



- ఎండల దెబ్బకు మాడిపోతున్న జనం
- సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తిల్లో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత
- 20 మండలాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- అత్యల్పం 36.8 డిగ్రీలు

ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా కన్పిస్తున్న తిరుచానూరు బైపాస్ రోడ్డు



తిరుపతి(కలెక్టరేట్), మే 1: జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఉదయం 7గంటలకే భానుడు సెగలు పుట్టిస్తుండడంతో బయటకు రావాలంటే జనం బెంబేలెత్తుతున్నారు.నాలుగు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటడం గమనార్హం.రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.రానున్న మూడురోజులు వడగాడ్పులు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. బుధవారం గరిష్ఠంగా శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేటల్లో 45.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా 20 మండలాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.నాయుడుపేట మండలంలో 45.8డిగ్రీలు, డక్కిలి, తొట్టంబేడుల్లో 44.8, ఏర్పేడులో 44.6, వెంకటగిరి,కేవీబీపురం,డీవీసత్రం మండలాల్లో 44.3,తిరుపతి రూరల్, నాగలాపురం మండలాల్లో 44, ఎర్రావారిపాళెం, చిట్టమూరుల్లో 43.7,రేణిగుంటలో 43.3, ఆర్‌సీపురం మండలంలో 43.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోట, వాకాడు, బాలాయపల్లె మినహా మిగిలిన మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం.గురువారం కూడా ఇదే విధంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

53,206 పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), మే 1:సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి బుధవారం 53,206మందికి పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు. జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో 2,70,394మంది పింఛను దారులుండగా 2,10,872మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని,వారంతా గురువారం డ్రా చేసుకోవచ్చని సూచించారు. మిగిలిన వారికి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డీబీటీ ఫెయిల్ అయిన వారికి కూడా నేటి నుంచి ఇంటి వద్దకే పింఛన్లు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు.సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని బుధవారం తిరుపతి రూరల్, ఆర్‌సీపురం, వడమాలపేట మండలాల్లో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు.

కేంద్ర బలగాలు వచ్చేశాయ్

శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరులకు కేటాయింపు



తిరుపతి(నేరవిభాగం), మే 1: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాలకు కేంద్ర బలగాలను మొహరించింది. ఇప్పటికే తిరుపతికి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు మూడు కంపెనీలు అంటే దాదాపు 240 మంది నెల కిందటే చేరుకున్నారు. వారు అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఫ్లాగ్ మార్చ్ చేస్తూ మేమున్నామని ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. రోజు రోజుకూ కొన్ని నియోజకవర్గాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తడం, ప్రచారాల్లో ఘర్షణ నెలకొనడం, ఇరు పార్టీలూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసుకోవడంతో జిల్లాకు మరిన్ని కేంద్ర బలగాలు వచ్చాయి. రెండ్రోజుల కిందట అండమాన్ నికోబార్ దీవుల నుంచి సీఆర్‌పీఎఫ్ బలగాలు మూడు కంపెనీలు అంటే 225 మంది తిరుపతికి చేరుకున్నారు. వీరితోపాటు సీఐఎస్ఎఫ్ బలగాలు మరో మూడు కంపెనీలు అంటే దాదాపు 230 మంది జిల్లాకు వచ్చారు. వీరంతా శాంతి భద్రతల విషయమై సంబంధిత అధికారులతో సమావేశం అవుతున్నారు. ఆ తర్వాత వీరిని జిల్లాలో అత్యంత సమస్యాత్మక ప్రాంతాలైన గూడూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు పంపనున్నారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గాల్లో ఎలాంటి వాతావరణం ఉంది.. ఘర్షణలు, విధ్వంసాలు, దాడులు, పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఈవీఎంలు అపహరించడం వంటి ఘటనలు ఎక్కడ జరిగే అవకాశం ఉందన్న వివరాలు తెలుసుకుంటున్నారు. మరోవైపు గత ఎన్నికల్లో ఎలాంటి కేసులు నమోదయ్యాయి అన్న కోణంలోనూ ఆరా తీస్తున్నారు. మరో రెండు, మూడ్రోజుల్లో ఈ మూడు నియోజకవర్గాల్లో కేంద్ర బలగాలు భారీ ఎత్తున మొహరించనున్నారు. ఆ తర్వాత ప్రతి పోలింగ్ కేంద్రాన్ని నిశితంగా తనిఖీ చేస్తారు.

చంద్రగిరిలో నేడు హలో లోకేశ్

చంద్రగిరి, మే 1: చంద్రగిరి మండలం అగరాల సమీపంలోని జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ప్రైవేటు స్థలంలో గురువారం హలో లోకేశ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విచ్చేయనున్నారు. ఈసందర్భంగా చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సభా స్థలాన్ని బుధవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి సుమారు పది వేల మంది యువత హాజరుకానున్నట్లు తెలిపారు. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా విద్యావ్యవస్థను తీర్చిదిద్దంపై, ఉద్యోగాల కల్పనకు కృషిపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. యువతీయువకులు భారీ స్థాయిలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని నానీ పిలుపునిచ్చారు.





అగరాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని - చదును చేస్తున్న సభా స్థలం

ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), మే 1: పుట్టుకతో అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఎనిమిదేళ్ల చిన్నారికి శస్త్ర చికిత్స చేసి, ప్రాణాలను నిలబెట్టామని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. రుయా చిన్నపిల్లల విభాగంలో బుధవారం మీడియాకు వివరాలు తెలిపారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం దళవాయిపల్లెకి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి హిమశ్రీకి పుట్టినప్పటి నుంచి కాళ్లకు, పొట్ట కింద భాగానికి రక్త సరఫరా వ్యతిరేక దిశలో జరుగుతుంది. దీంతో బాలిక పొట్ట నుంచి కాళ్ల వరకు శరీరం అంతా పచ్చని రంగులోకి మారి ప్రమాదకరంగా తయారైంది. ఈ సమస్యతో చిన్నారి సరిగ్గా నడిచే పరిస్థితి కూడా లేకపోయింది. పలు ఆస్పత్రుల్లో చూపించినా, దీనికి చికిత్స లేదని చెప్పడంతో వారం కిందట రుయా చిన్నపిల్లల విభాగానికి బాలికను ఆమె తల్లి సుశీల తీసుకొచ్చింది. కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రమ పరీక్షించి బాలిక లార్జ్ ఆర్టీరియో వీనస్ మాల్ ఫార్మేషన్ ఆఫ్ బై లెటర్ లోయర్ లింబ్స్, అబ్డామిన్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, డాక్టర్ రాధా సాయంతో అధునాతన పద్ధతిలో చిన్నారికి నాన్ ఇన్వేసివ్ రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ అనే టెక్నిక్‌తో కోత, కుట్లు లేకుండా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం చిన్నారి పూర్తిగా కోలుకోవడంతోపాటు సాధారణంగా నడుస్తుందని రవిప్రభు తెలిపారు. ఇటీవల రుయాస్పత్రిలో చేస్తున్న అరుదైన శస్త్ర చికిత్సలకు సంబంధించిన వివరాలు పత్రికల్లో చూసి వీరు ఇక్కడకు వచ్చారన్నారు. ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, క్లినికల్ పర్ఫ్యూజనిస్ట్ చిరంజీవి, నర్సింగ్ అధికారి రాధా తదితరులు పాల్గొన్నారు.



కోలుకున్న చిన్నారితో వైద్య బృందం

దామినేడు అభివృద్ధికి కృషి



వినీల్, సీఆర్‌రాజన్‌లను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

తిరుచానూరు, మే 1: టీడీపీ అధికారంలోకి రాగానే దామినేడు ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ అన్నారు. అన్నారు. బుధవారం ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న వినీల్, చిత్తూరు టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్‌రాజన్, డాలర్స్ దివాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన నడుస్తోందని, అలాంటి వారిని ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వెయ్యి ఎకరాల మఠం భూములు చెవిరెడ్డి కబ్జాలో ఉన్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అన్ని వర్గాలప్రజలకు మేలు జరిగేలా మేనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్‌రెడ్డి, రమేష్, మోహన్‌రెడ్డి, మార్కండేయులు, వెంకటరమణ నాయక్, గౌరి, సరస్వతి, లక్ష్మి, పార్వతమ్మ, దామినేడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరికోటపై టీడీపీ జెండా ఎగురవేద్దాం



మాట్లాడుతున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, మే 1: చంద్రగిరికోటపై టీడీపీ జెండాని ఎగురవేద్దామని ఆపార్టీనేత డాలర్స్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలంలో తనపల్లె, కుంట్రపాకం పంచాయతీల్లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రచారసభలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేశారని దుయ్యబట్టారు. టీడీపీ ఎమ్మెల్యేగా నానీని గెలిపించుకుని చంద్రగిరిను చంద్రబాబుకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. మండలపార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు బాలచంద్రారెడ్డి, సందీప్‌రెడ్డి, మన్మథరెడ్డి, దయాకర్, లోకనాథరెడ్డి, రామమూర్తి, చెంచురెడ్డి, మునికృష్ణయాదవ్, నాగరాజు, కుమార్, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు. ● తుమ్మలగుంట గ్రామంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల కాలంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధిపై ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే చెవిరెడ్డికి సవాల్ విసిరారు. నాయకులు అయ్యప్ప, సిద్దారెడ్డి, చెంగ్రామానాయుడు, రేవంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మురళి, సురేష్, రాధారాయల్, రాజానాయుడు, శేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి ఓటర్ల లిస్టుల్లో ఫొటోలు అస్పష్టంగా ఉన్నాయి

● టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి



అస్పష్టంగా ఉన్న ఓటర్ల జాబితాను మీడియాకు చూపుతున్న సుధారెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 1: చంద్రగిరి ఓటర్ల జాబితాలో ఫొటోలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ఆరోపించారు. వీటిని స్పష్టంగా ఉండేలా జాబితాలను ముద్రించి పంపిణీ చేయాలని చంద్రగిరి ఆర్వో నిషాంత్‌రెడ్డిని కోరారు. బుధవారం ఈ మేరకు తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఆర్వోని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్లిప్పుల పంపిణీలో బీఎల్‌ఏలను ఎందుకు భాగస్వాములను చేయడంలేదని బీఎల్‌వోను అడిగితే... తమకు అలాంటి ఆదేశాలు లేవని ఆయన చెప్పారని ఆర్వోకు వివరించారు. 25వేల ఎపిక్ కార్డులను పంపిణీ చేశామని అధికారులు చెప్తున్నారని, కాని వాటిలో సుమారు 10 వేల కార్డులు మాత్రమే ఓటర్లకు చేరాయని, మిగిలిన 15 వేల ఎపిక్ కార్డులు ఏమయ్యాయో తెలపాలని కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... ఈ విషయాలన్నింటిపై చంద్రగిరి ఆర్వోకు, కలెక్టర్‌కు, ఈసీకి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్వో తెలిపినట్టు వివరించారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి



కవాతు చేస్తున్నపోలీసులు

రామచంద్రాపురం, మే 1: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌ఐ చిరంజీవి అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎస్‌ఐ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుల్ రమణయ్య, యోబు, ధనంజయులు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

రామచంద్రాపురం, మే 1: గంగిరెడ్డిపల్లె గ్రామంలోని మనోహర్‌రెడ్డికి చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు బుధవారం దగ్ధమైంది. హఠాత్తుగా గడ్డివామిలో మంటలు చెలరేగడంతో గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈలోపు గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. రూ.20వేలు విలువ చేసే గడ్డి పూర్తిగా కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్ లక్ష్మీసుధ తదితరులు

పాకాల, మే 1: మండలంలోని ఓబులశెట్టివారిపల్లె పంచాయతీలో వైసీపీ నుంచి పలువురు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో ఓబులశెట్టివారిపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ లక్ష్మీసుధ, పవన్‌కుమార్, గణేష్, అమర, వాణి, భారతి, చక్రపాణి, పంకజ, శివయ్య నాయుడు, రెడ్డప్ప, బోలా నాయుడు, సుమతి, జగదీష్, పుష్ప, విజయ, సుబ్రమణ్యం నాయుడు, కృష్ణం నాయుడు, సత్యనారాయణ మూర్తి తదితరులు తెలుగుదేశంలో చేరారు. పులివర్తి నాని విజయం కోసం కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

పులివర్తి నానీకి ఒక్క అవకాశం ఇవ్వండి



చిన్నగొట్టిగల్లులో టీడీపీ శ్రేణుల ప్రచారం

భాకరాపేట, మే 1: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీకి ఒక్క అవకాశం ఇవ్వాలని చిన్నగొట్టిగల్లు క్లస్టర్ ఇన్‌చార్జ్ కొట్టే శివ కుమార్ చిన్నగొట్టిగల్లు, తిప్పిరెడ్డిగారిపల్లె, చిట్టేచర్ల, భాకరాపేట పంచాయతీల్లో టీడీపీ నాయకులతో కలిసి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల గురించి వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, మోహన్ రెడ్డి, విజయశేఖర్ గౌడ్, బావాజాన్, చంద్రశేఖర్, లోకనాథం, వెంకటరత్నం, మునిచంద్ర, రవీందర్ రెడ్డి, సహదేవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కాకి వెంకటరమణ, షబాబ్ బాషా, చెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోసానిని రాష్ట్రంలో తిరగనివ్వం: కిరణ్ రాయల్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 1: పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమురళిని కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో తిరగనివ్వమని జనసేన నేత కిరణ్ రాయల్ అన్నారు. ప్రెస్ క్లబ్‌లో బుధవాం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్మోహన్‌రెడ్డి జీతగాడు పోసాని అని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా పవన్ విషయంలో తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీ తనిఖీ



పింఛను అందజేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

రామచంద్రాపురం, మే 1: మండలంలోని రామాపురంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. రామాపురం గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడికి ఆయన నేరుగా పింఛను అందజేశారు. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పింఛన్ల కోసం ఎవరూ సచివాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు.

'హలో లోకేశ్'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సురేష్ చౌదరి

పాకాల, మే 1: చంద్రగిరి కోట ఎదురుగా గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్న హలో లోకేశ్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో యువత తరలివచ్చి విజయవంతం చేయాలని చంద్రగిరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కె.సురేష్ చౌదరి కోరారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ భావి తరాల భవిష్యత్తుకోసం, రాష్ట్రాభివృద్ధికోసం, అన్ని వర్గాల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ పాలన రావాలని కోరారు. టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని లోకల్ కాదనడం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనడం హాస్యాస్పదమన్నారు. పాకాల మండలం పులివర్తివారిపల్లె పంచాయతీ సర్పంచ్‌గా నాని సేవలు అందించారని గుర్తు చేశారు. పులివర్తి నానీకి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా డాలర్స్ డివాకర్‌రెడ్డి

చంద్రగిరి, మే 1: చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన డాలర్స్ దివాకర్‌రెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్లపల్లెకు చెందిన డాలర్స్ దివాకర్‌రెడ్డి ఇటీవల టీడీపీలో చేరిన విషయం తెలిసిందే.

ఎన్నికల టీడీపీ కోఆర్డినేటర్లుగా సీఆర్ రాజన్, శ్రీరామినేని చంద్రప్రకాష్: చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల టీడీపీ కోఆర్డినేటర్లుగా చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, జడ్పీ మాజీ ఛైర్మన్ గీర్వాణి భర్త శ్రీరామినేని చంద్రప్రకాష్‌ను రాష్ట్ర పార్టీ నియమించింది.

పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా ఏర్పాట్లు

తిరుపతి (ఆటోనగర్), మే 1: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ మండలం పరిధిలోని 243 పోలింగ్ కేంద్రాల వద్ద ఏఈలు విద్యుత్ కనెక్షన్లను తనిఖీ చేశారని ఆయన చెప్పారు. బుధవారం తాను కూడా కొన్ని కేంద్రాలను పరిశీలించానని, ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకొంటున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు వుంటే పర్యవేక్షకులు తనదృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు. తన పరిధిలోవున్న చంద్రగిరి నియోజకవర్గంలో 138, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 65 పోలింగ్ కేంద్రాల్లో కూడా ఎలాంటి అసౌకర్యాలు, విద్యుత్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

ఎన్నికలప్పుడే రాజకీయాలు... అభివృద్ధే మా లక్ష్యం

\- పులివర్తి నాని





ఎర్రావారిపాలెంలో మాట్లాడుతున్న పులివర్తి నాని, నెన్నూరులో మాట్లాడుతున్న సుధారెడ్డి

ఎర్రావారిపాలెం, మే 1: ఎప్పుడూ ఎన్నికలప్పుడే తాను రాజకీయాలు చేస్తానని, పాలనలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని చంద్రగిరి టీడీపీ కూటమి అభ్యర్థి పులివర్తి నానీ అన్నారు. తాను బెదిరింపు రాజకీయాలకు పాల్పడి ఉంటే మీరు రాజకీయాలు చేసి ఉండేవారు కాదని వైసీపీ నాయకులకు నానీ గుర్తు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో రోజైన బుధవారం మండలంలో ఉదయమాణిక్యం, ఎర్రావారిపాలెం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఎర్రావారిపాలెం సంత గేటు వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తాను గెలిచిన ఏడాదిలోపే భాకరాపేట-ఉస్తికాయలపెంట డబుల్‌రోడ్‌ను ప్రారంభిస్తానని హామి ఇచ్చారు. తలకోనలో నిలిచిపోయిన పుష్కరిణిని పూర్తిచేయడంతో పాటు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వైసీపీ వారికి తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. తమకు ఓటేసేవారి కార్డులు కట్ చేస్తామని బెదిరిస్తున్నారని, కట్ అయ్యేది కార్డులు కాదని.. వైసీపీ వారి తోకలని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

కమ్మల్ల పుష్పా.. నిన్ను చెవిరెడ్డి రక్షించలేడు

ఎర్రచందనం డబ్బుతో రాజకీయాల్లో ఎదిగిన కమ్మల్ల చెంగల్ రెడ్డి.. పుష్పారీతిలో బెదిరింపులకు పాల్పడుతున్నావు.. నిన్ను చెవిరెడ్డి కూడా రక్షించలేడని అన్నారు. ఇప్పటికే బెంగళూరులో తలదాచుకునేందుకు సిద్ధం చేసుకొన్నావంటా.. అయినా నిన్ను వదిలేది లేదని నాని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, కార్యదర్శి మహేష్ నాయుడు, జిల్లా కార్యదర్శి మధు, కేశవులు నాయుడు, లక్ష్మీదేవి, రఘు, దేవర మనోహర్, శేషు, మురళి, దేవి, రెడెప్పరెడ్డి, విజయారెడ్డి, సురేంద్రబాబు, ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం అమలైందా..? : సుధారెడ్డి

రామచంద్రాపురం, మే 1: అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీ ఏమైందటూ టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ప్రశ్నించారు. మండలంలోని నెన్నూరులో బుధవారం రాత్రి మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్ధన్‌చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, జేడీ జగన్, మధుసూదన్‌రెడ్డి, మండల నాయకులు గిరి నాయుడు, సురేంద్ర నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, సాయి, జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

కమతంపల్లెలో టీడీపీ ఇంటింటా ప్రచారం

పాకాల, మే 1: మండలంలోని పాకాల పంచాయతీ కమతంపల్లెలో తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని పార్టీని ఆదరించాలన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన, పరిశోధనల్లో పరస్పర సహకారం

పద్మావతి వర్సిటీలో జర్మన్ ప్రతినిధుల సందర్శన



జర్మన్ ప్రతినిధులతో పద్మావతి వర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 1: జర్మన్ ప్రతినిధుల బృందం బుధవారం పద్మావతి మహిళా యూనివర్సిటీని సందర్శించింది. వీసీ భారతి, రిజిస్ట్రార్ రజనితో వారు సమావేశమయ్యారు. యూనివర్సిటీలోని కోర్సులు, ఆయా కోర్సుల పరిధిలో అమలవుతున్న బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో కృషిని అడిగి తెలుసుకున్నారు. ఈ కోర్సుల పరిధిలో అవసరమైన బోధన, పరిశోధన రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు అంగీకారం తెలిపారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఒప్పందం చేసుకోనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్మన్‌లోని భారత రాయబార కార్యాలయ ప్రతినిధి రామానుజ బెనర్జీ, మాగ్డేబర్గ్, హెడెల్ బర్గ్, కొలోన్ యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు డాక్టర్ జీన్స్ స్ట్రైక్‌జన్, డాక్టర్ షిమ్‌దిత్, డాక్టర్ ఉల్‌రైక్ స్టైమన్, డాక్టర్ ఉల్ఫ్ కొహ్లార్ట్, డాక్టర్ కట్టర్‌ఫెల్డ్, డాక్టర్ స్కెల్‌ఫ్లైర్, డాక్టర్ దీబన్ మధివనన్, డాక్టర్ సుబూర్ భక్ష్, డాక్టర్ అమిష జైన్, డాక్టర్ విభుటి సుక్రమణి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ కాలనీలో సమస్యల ఏకరువు

● నీటి సమస్యలతో ప్రజలు సతమతం
● అధ్వానంగా పారిశుధ్యం



రోడ్డుపైనేచెత్తాచెదారం

తిరుపతి (జీవకోన), మే 1: తిరుపతి నగర పరిధిలోని జీవకోన రాజీవ్‌గాంధీ కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెలుగుగంగ నీటిని మూడ్రోజులకోసారి వదులుతుండటంతో చేసేదేమి లేక ప్రజలు ప్రైవేటు వాటర్ ట్యాంకులను ఆశ్రయిస్తున్నారు. కాలనీలోని మూడవ లైన్‌లో డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్లను తవ్వారు. ఏడాది గడచినా కూడా ఇప్పటి వరకు ప్యాచ్ వర్కులను కూడా చేపట్టలేదు. 10, 11వ లైన్లలో నూతన రోడ్డు వేశారు కానీ కాలువలు నిర్మించడం మరిచారు. స్థానికంగా పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడ వేసిన చెత్త అక్కడే అన్న చందంగా తయారైంది. బుధవారం సాయంత్రం నాలుగున్నరగంటల ప్రాంతంలో ఆంధ్రజ్యోతి ప్రతినిధి కాలనీలో పర్యటించగా రోడ్లపైనే చెత్త దర్శనమిస్తోంది. కాలువలుకూడా చెత్తా చెదారంతో నిండి ఉన్నాయి. దీంతో స్థానికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఇకనైనా సంబంధిత అధికారులు సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అన్నదానం

మంగళం, మే 1: మేడే, అఖిల భారతీయ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్ వద్ద గల రాష్ట్రీయ సేవాసమితి వృద్ధాశ్రమంలో సంఘం వ్యవస్థాపకులు పాలముంతల సుబ్బుయాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గోపి, రెడ్డెప్ప, దిగాల మధు, చిన్నప్ప, ఖాదర్‌వలి, కృష్ణనాయక్, మునికృష్ణ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

తిరుపతి అర్బన్: మెటర్నిటీ హాస్పిటల్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. తిరుపతి అధ్యక్షుడు మక్కిన భాస్కర్, కార్యదర్శి శంకరయ్య, కోశాధికారి చక్రపాణి, సోమయ్య, వామాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి ప్రశంసాపత్రం



ఆవుల ప్రభాకర్‌యాదవ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఈడీ

తిరుపతి(ఆర్టీసీ), మే 1: ఆర్టీసీ ఉద్యోగి ఆవుల ప్రభాకర్‌యాదవ్‌కు కడప జోన్-4 ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు బుధవారం ప్రశంసాపత్రం అందజేశారు. మార్చినెలలో తిరుమలలో ఓ చిన్నారి అదృశ్యం ఘటనకు సంబంధించి నిందితురాలి ఆచూకీని ఆర్టీసీ సెంట్రల్ బస్సుస్టేషన్ కంట్రోలర్, ఎంప్లాయిస్ యూనియన్ నేత ఆవుల ప్రభాకర్‌యాదవ్ సకాలంలో పోలీసులకు సమాచారం అందించారు. ఈ సమాచారం కీలక పాత్ర పోషించిందని ఈడీ ప్రశంసించారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం డి.రామచంద్ర నాయుడు, ఈయూ నాయకులు ఈ.రమేష్‌కుమార్, తాండాయం సత్యనారాయణ, అలిపిరి డీఎం హరిబాబు, డీఈ చెన్నకేశవులు, ఈఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెలిస్తే సకల జనుల సంక్షేమం

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 1: లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సకల జనుల సంక్షేమం సాధ్యమవుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు, రిటైర్డు ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐఏఎస్ అధికారిగా రాష్ట్రంలోని సామాన్య ప్రజల సమస్యలను స్వయానా చూశాననీ, ఈ సమస్యలకు రాజకీయ పరిష్కారం చూపాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఉన్నత వర్గాల్లోని పేదల కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలను పతనం చేసిన వైసీపీ



టీఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఆరణి శ్రీనివాసులు, నరసింహయాదవ్, సింధూజ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), మే 1: రాష్ట్రంలో కార్మికుల జీవితాలను వైసీపీ ప్రభుత్వం పతనం చేసిందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్ర.దాన కార్యదర్శి అంబూరి సింధూ జ అన్నారు. స్థానిక అబ్బన్న కాలనీ వద్ద బుధవారం మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పాల్గొని టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎ.మోహన్, రెడ్డెప్ప నాయుడు, శ్రీవేంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ నాయకులు మహేష్, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి(ఆటోనగర్): యశోదనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు ఎ.వీరవర్మ,కందారపు మురళి, జీవీఎస్ మణ్యం, రవి, టి.సుబ్రమణ్యం, ఎన్‌డీ శ్రీనివాసులు, జయచంద్ర, బుజ్జి, మల్లికార్జునరావులు పాల్గొన్నారు. ● సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నేత పి.హరినాథరెడ్డి, ఇండియా కూటమి తిరుపతి అసెంబ్లీ అభ్యర్థి పి.మురళి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీయూ ఓఆర్‌ఐలో ఎన్‌ఆర్‌ఐల బృందం



ఓఆర్‌ఐని పరిశీలిస్తోన్న ఎన్‌ఆర్‌ఐల బృందం, చిత్రంలో డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 1: ఎస్వీ యూనివర్సిటీలోని ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్‌ఐ)ను ఎన్‌ఆర్‌ఐల బృందం సందర్శించింది. అమెరికాలోని అట్లాంటా రాష్ట్రం జార్జియాలో గల ప్రతిష్టాత్మక కంపెనీలు సెరినిటీ ఇన్ఫోటెక్ ప్రతినిధి ఉపేంద్రరెడ్డి, విజన్ ఇన్ఫోటెక్ ప్రతినిధి రాజశేఖర్ సీ-విజన్ ఇన్ఫోటెక్ ప్రతినిధి పరిశీలించారు. అంతకుముందు యూనివర్సిటీ వీసీ శ్రీకాంత్‌రెడ్డితో వారు సమావేశమయ్యారు. ఓఆర్‌ఐలోని తాళపత్రాలు, రాతపత్రులు, డిజిటలైజేషన్ ప్రక్రియ, ప్రచురణ విధానం వంటి అంశాలను పరిశీలించారు. తాళపత్రాలను సంరక్షించే పద్ధతిని ఓఆర్‌ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లు వారికి వివరించారు. ఓఆర్‌ఐ పరిశోధకులు డాక్టర్ రాజశేఖర్, సంతోష్, డాక్టర్ సుందర్‌రాజారెడ్డి, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశానికి పూర్వ వైభవం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(కపిలతీర్థం), మే 1: దేశానికి పూర్వ వైభవం రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు యార్లపల్లి గోపీ అన్నారు. స్థానిక గాంధీరోడ్డు, సున్నపువీధి, హెడ్ పోస్టాఫీసు ప్రాంతాల్లో ఆయన బుధవారం కాంగ్రెస్ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ చింతా మోహన్‌ను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, నేతలు భానుప్రకాష్, నాగరాజు, షేక్ జావెద్, శాంతి యాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రుయాకు రూ. 1.25 లక్షల వైద్య పరికరాలు

\- అందజేసిన రోటరీక్లబ్



వైద్య పరికరాలను సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న రోటరీక్లబ్ నిర్వాహకులు

తిరుపతి(వైద్యం), మే 1: రుయాస్పత్రి అత్యవసర విభాగానికి రూ.1.25 లక్షల విలువచేసే వైద్య పరికరాలను రోటరీక్లబ్ తరపున మాజీ సూపరింటెండెంట్, క్లబ్ మెంబర్ డాక్టర్ భారతి అందజేశారు. వీటిని బుధవారం సూపరింటెండెంట్ రవిప్రభుకు అందజేయగా, ఏఆర్‌ఎంవో హరికృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అరుణ, క్లినికల్ పర్ఫ్యూజనిస్ట్ చిరంజీవి, సిబ్బంది రాధా తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి వైసీపీ అవరోధం

\- కూటమి నేతలు నరసింహ యాదవ్, పసుపులేటి హరిప్రసాద్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 1: రాష్ట్రంలోని బీసీ వర్గాల అభివృద్ధికి వైసీపీ అవరోధంగా నిలిచిందని టీడీపీ నాయకుడు నరసింహయాదవ్, జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, పొనగంటి భాస్కర్, టీడీపీ బీసీ సెల్ నేత జగన్నాథం అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో బీసీలను అన్నివిధాలుగా అణిచి వేశారని విమర్శించారు. తిరుపతిలో కూటమి అభ్యర్థి గెలుపుతో క్షురకుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని చెప్పారు. వైసీపీ హయాంలో కల్యాణ కట్టలో పని చేస్తున్న 49 మందిని తొలగించారని అన్నారు. మహిళా క్షురకులను తనిఖీల పేరుతో అవమానిస్తున్నారని చెప్పారు. తాను ప్రజల మనిషి అని చెప్పే టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి ఇలాంటి వారికి న్యాయం చేయడం తెలియదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్, కార్పొరేటర్ అన్నా అనిత, రాజారెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, భాను, రాజేష్ యాదవ్, ఆనంద్, చందు, యశ్వంత్ పాల్గొన్నారు.

కూటమి గెలిస్తేనే బీసీల అభివృద్ధి: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ నేత రుద్రకోటి సదాశివం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 1: రాష్ట్రంలో కూటమి గెలిస్తేనే బీసీల అభివృద్ధి సాధ్యమని తిరుపతి పార్లమెంటు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో.. బీసీల సంక్షేమానికీ, అభివృద్ధికీ పెద్ద పీట వేసేలా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జనసేన నగర ఉపాధ్యక్షుడు బాబ్జీ, నగర ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆచారి, టీడీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు విశ్వనాథం, నాయకులు తంజావూరు రామయ్య, గోవిందాచారి, వెంకటముని, రమేష్ బాబు పాల్గొన్నారు.

ఘనంగా మే డే వేడుకలు



సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

పాకాల, మే 1: మండలంలో బుధవారం కార్మికులు మే డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. బాలాజీ లగేజి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బస్టాండు ఎదురుగా వేడుకలు నిర్వహించారు. శక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అమ్మ ఆటో స్టాండ్ సభ్యులు మే డే జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రమేష్, ఆనంద, రాజా, ఎం.ప్రకాష్, ఇ.మధుసూదన్‌రావు, రవి, ప్రసాద్, షేక్ లాల్, గణేష్, అగస్టిన్, బాలాజీ, గుణశేఖర్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

చంద్రగిరి: జాతీయ రహదారిలోని శ్రీకృష్ణదేవరాయ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు జెండా ఎగురవేశారు. ఆటో యూనియన్ నాయకులు గొల్లమూరి సుబ్రమణ్యం, లక్ష్మీపతి, సిద్దయ్య, ప్రవీణ్‌కుమార్, త్యాగరాజులు, హరి, చిరంజీవి, కిషోర్, బాలసుబ్రమణ్యం, బాలకృష్ణ, అనంత, మునిరామయ్య, ఏపీఎస్ అధ్యక్షుడు బాదూరు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి(వైద్యం): రుయాస్పత్రి ఆవరణలో మేడు వేడుకలను కార్మిక సంఘాల నేతలు బుధవారం నిర్వహించారు. కార్యాలయ భవనం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ఎర్రజెండా ఎగురవేసి కార్మికుల హక్కులు, వారి త్యాగాల గురించి వివరించారు. ఏఐటీయూసీ యువ నేతలు మహేంద్ర, కిశోర్, మునివేలును శాలువాలతో సన్మానించారు. అలాగే ఓపీ ఎదురుగా ఉన్న సీఐటీయూ కార్యాలయం ముందు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఏఐటీయూసీ నేతలు పురుషోత్తం, సునీల్, రూపాదేవి, మీనా, వరలక్ష్మీ, సులోచన సీఐటీయూ నేతలు మునిచంద్ర, నరసింహులు, సుబ్రహ్మణ్యం, మధుబాబు పాల్గొన్నారు.

తిరుపతి

ఆటోనగర్‌లో వైసీపీ ఖాళీ / టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలోకి చేరుతున్న ఆటోనగర్ వైసీపీ నాయకులు

తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వైసీపీ నుంచి టీడీపీ, జనసేన పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా తిరుపతి టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ సమక్షంలో ఆటోనగర్ రెండో వార్డుకు చెందిన వైసీపీ నాయకులు చల్ల కలై సెల్వం, గోపి, శంకర్ రెడ్డి, వీరయ్య, దశరథ, మనోహర్ నాయుడు, వెంకటేష్, రాజు, సుధాకర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, రామచంద్ర, రామరాజు, రాము, కుట్టి, దాసు నాయుడు, శివశంకర్ రెడ్డి, వీకే లక్ష్మణ్, అర్జున్, వెంకటేష్, కృష్ణ, సృజన్, సుబ్బారావు చౌదరిలు టీడీపీలో చేరారు. వీరికి నరసింహ యాదవ్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆటోనగర్లో వైసీపీ ఖాళీ అయిపోయిందని, ఈ ఎన్నికల్లో స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి కృష్ణ యాదవ్, రాష్ట్ర నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఊకా విజయ్ కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నేతలు దంపూర్ భాస్కర్, పుష్పావతి యాదవ్, చినబాబు, యశ్వంత్, రామ యాదవ్, డివిజన్ నాయకులు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరనున్న నరసింహులు నాయుడు

పవన్ సమక్షంలో చేరేందుకు సన్నాహం ● ఆరణి హర్షం



ఆరణితో నరసింహులు నాయుడు

తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ పూర్వ నాయకుడు, మాజీ తహసీల్దార్ ఎం.నరసింహులు నాయుడు తన సన్నిహితులతో కలిసి జనసేనలో చేరేందుకు రంగం సిద్ధమైంది. తిరుపతి పర్యటనకు రాబోతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలోఆయనతోపాటు సన్నిహితులు పెద్దఎత్తున చేరబోతున్నారు. నరసింహులు నాయుడు గతంలో రెవెన్యూ ఉద్యోగ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకుడిగా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకుడిగా సుమారు 30 ఏళ్లపాటు సేవలందించారు. అలాగే సీపీఎస్ రద్దు కోసం తీవ్రంగా కృషిచేశారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో కూడా కీలకపాత్ర పోషించారు. ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమం తిరుపతిలో ఆవిర్భావానికి ఈయన 122 సంఘాలను ఏకీకృతంచేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ప్రొటోకాల్ విధులు నిర్వర్తించి విస్తృతమైన పరిచయాలు కలిగివున్నారు. ఉద్యోగుల, పెన్షనర్ల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేసి, ఉద్యోగ సంఘ నాయకుడిగా గుర్తింపు పొందారు. నరసింహులునాయుడితోపాటు రెవెన్యూ విభాగంలో పనిచేసి పదవీవిరమణ పొందినవారు కూడా పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం కృషిచేస్తామని ఈసందర్భంగా నరసింహులు నాయుడు చెప్పారు. వీరిరాక పార్టీకి బలం చేకూరుతుందని ఆరణి హర్షం వ్యక్తం చేశారు.

నా ఆశీస్సులు ఆరణికే

● జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆరణితో చదలవాడ



టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మే1(ఆంధ్రజ్యోతి): జనసేన అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆరణి శ్రీనివాసులకే తన మద్దతు ఉంటుందని టీటీడీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి స్పష్టం చేశారు. చదలవాడ జన్మదినం సందర్భంగా ఎన్డీయే కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా చదలవాడ ఉండాలని ఆరణి శ్రీనివాసులు ఆకాంక్షించారు. తన ఆశీస్సులు ఆరణికి ఉంటాయని చదలవాడ ఈసందర్భంగా భరోసా ఇచ్చారు. చదలవాడకు శుభాకాంక్షలు తెలిపినవారిలో కూటమి నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, గుండాల గోపీనాథ్ ఉన్నారు.

జనసేనలోకి వేశాలమ్మ గుడి మాజీ చైర్మన్లు



తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి): జనసేనాని పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి వైసీపీని వీడి జనసేనలో పెద్దఎత్తున చేరికలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వేశాలమ్మ గుడి ఆలయ మాజీ చైర్మన్లు అశోక్ కుమార్, కోదండ రెడ్డిలు తమ అనుచరులు 30 మందితో వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. ఎన్డీయే ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వీరికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆరణి మాట్లాడుతూ.. తిరుపతిలో వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను చూసి జనం భరించలేకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్, కోదండ రెడ్డి మాట్లాడుతూ.. ఆరణి శ్రీనివాసులు గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

పెద్దకాపు వీధిపై పగపట్టిన వైసీపీ

● అభినయ్ రెడ్డిని ఓడించాలని పులుగోరు మురళి ప్రచారం



పీకేలేఅవుట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పులుగోరు మురళీకృష్ణా రెడ్డి

తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి మెజారిటీ రాదని అక్కసుతో పెద్దకాపు వీధిపై ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, అభినయ్ రెడ్డిలు పగపెట్టుకున్నారని, దారిలేకుండా రోడ్లు తవ్వేశారని టీడీపీ సీనియర్ నేత, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణా రెడ్డి మండిపడ్డారు. ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం 11వ డివిజన్ పెద్దకాపులేఅవుట్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు రూ.2కోట్లు లంచం ఇస్తేనే రోడ్డు వేస్తామని వైసీపీ నేతలు బెదిరించారని ఆరోపించారు. అభినయ్ రెడ్డిని ఓడించాలని, గాజుగ్లాసు గుర్తు మూడో నెంబరుపై ఓటువేయాలని కోరారు. ఈకార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి కంకణాల రజనీకాంత్ నాయుడు, నాయకులు హేమంత్ యాదవ్, పవన్, భారతి, జలపోతు చంద్ర, ఈతమాకుల వెంకటేష్, శరత్, జేఎంసీ వెంకటేశ్వర రావు, ఆశాజ్యోతి, వెంకటేష్, జనార్ధన్‌లు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు

తిరుమల, మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ప్రకటించింది. మంగళవారం 72,310 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,731 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో కర్ణాటక హైకోర్టు సీజే



జస్టిస్ ఎన్వీ అంజేరియా

తిరుమల, మే 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ అంజేరియా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం జరుగనుంది. టీటీడీ పరిపాలన భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై నేరుగా ఈవో ధర్మారెడ్డితో మాట్లాడవచ్చు. దీని కోసం భక్తులు 0877 2263261 నెంబరును సంప్రదించాల్సి ఉంటుంది.

కరుణాకర రెడ్డికి మతి భ్రమించింది

తిరుపతి ప్రజల ఆగ్రహంలో రాజారెడ్డి కలుపు మొక్కలు కొట్టుకుపోవడం ఖాయం

ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



ఆరణికి గజమాలతో స్వాగతం, పక్కన పనబాక లక్ష్మి, సుగుణమ్మ

తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి): కరుణాకర రెడ్డి మతి భ్రమించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. 'కడపలో పిక్ పాకెటర్‌గా బతికిన నువ్వు.. అక్కడ తన్ని తరిమితే తిరుపతికి వచ్చిన నువ్వు.. నన్ను జేబు దొంగ అంటావా?' అని భూమనపై ఆరణి మండిపడ్డారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మబ్బు దేవనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 18వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో ఆరణి పాల్గొన్నారు. తిరుపతిలో రాజారెడ్డినాటిన పెద్దకలుపు మొక్క పనైపోవడంతో పిల్ల మొక్కను దింపారని.. ప్రజాగ్రహంలో అదీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. 'నాకు రాజ్యసభ సీటు ఇస్తామని మాటతప్పి మడమ తిప్పింది జగన్ కాదా' అని ఆరణి ప్రశ్నించారు. అవినీతి మరక అంటని నాయకుడు పవన్ కల్యాణ్ అన్నారు. అలాంటిది రూ.3కోట్లు ఇచ్చి సీటు తీసుకోవాల్సిన అవసరం తనకు కానీ, తీసుకోవాల్సిన అవసరం పవన్‌కి కానీ లేదని ఆరణి చెప్పారు. ఏమీ తెలుసుకోకుండా అక్కసుతో మతిభ్రమించి మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి.. మెంటల్ హాస్పిటల్లో చూపించుకోవాలని హితవు పలికారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పి.మురళీకృష్ణారెడ్డి, పులుగోరు మురళి, ధనంజయ నాయుడు, దేవరాజులు నాయుడు, బీజీ కృష్ణయాదవ్, దంపూరి రాజ్యలక్ష్మి, రుద్రకోటి సదాశివం, ప్రసాద్‌యాదవ్, ఎల్లంనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, పత్తిపాటి వివేక్‌నాయుడు, పాటకం వెంకటేష్, చందుయినుకొండ, కూరపాటి సురేష్ నాయుడు, జీవి రత్నం, జనసేన నాయకులు రాజా రెడ్డి, ఉదయ్, లక్ష్మీపతి రాయల్ పాల్గొన్నారు.



ఆరణి మదన్ సమక్షంలో జనసేనలో చేరుతున్న వైసీపీ నేత లోకేశ్, పక్కన మంత్రి పురుషోత్తం, గోపి

జనసేనలోకి టీఎన్‌పాళెం వాసులు: తిమ్మినాడుపాళెం అరుంధతివాడలోని వైసీపీ నేత సూరి పాకు లోకేశ్‌తోపాటు 40కుటుంబాలు ఆరణి మదన్ సమక్షంలో జనసేనలో చేరాయి. మంత్రి పురుషోత్తం, మాసారపు గోపి, రాజగోపాల్, సుధాకర్, కార్తీక్, రవి, మునిరాజా, శివ పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థి గెలుపే ధ్యేయం

● ఊకా విజయ కుమార్ ఇంటింటి ప్రచారం



తిరుపతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపే ధ్యేయంగా టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ కుమార్ బుధవారం 30వ డివిజన్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తిరుపతి ఓటర్లు నిర్ణయం తీసుకునేశారని చెప్పారు. అందరూ గాజు గ్లాసు గుర్తుకు ఓటువేసి జనసేన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మునికృష్ణ, మధు, శ్రీను, గోవిందాచారి, నాగరాజు, జ్ఞానశేఖర్, రేఖ, రేవతి, లక్ష్మి, మంజుల, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎన్‌వోకు మెమో

తిరుపతి(వైద్యం), మే 1: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు సిబ్బందిని హెచ్చరించారు. వీల్‌చైర్‌ను రోగికి సాయంగా ఉన్న ఓ బాలుడితో తోయించిన ఎఫ్ఎన్‌వో ఈశ్వరమ్మకు ఆయన బుధవారం మెమో జారీ చేశారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అధికారుల పర్యవేక్షణ లోపం.. రోగులకు శాపం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన సిబ్బందితో సమీక్షించి రోగుల విషయంలో చిన్నపాటి పొరపాటు జరిగినా సహించేది లేదన్నారు. రోగుల చేతికి సెలైన్ సీసాలు పెట్టుకుని తిరుగుతుంటే మీరేం చేస్తున్నారని మందలించారు. మరోసారి ఇలా జరిగితే ఇంటిదోవ తప్పదని హెచ్చరించారు. వైద్యాధికారులు సైతం నిత్యం ఆస్పత్రిలో పర్యటిస్తూ ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కార్మికుడి గుండె శస్త్రచికిత్సకు ఆర్థికసాయం

తిరుపతి (జీవకోన), మే 1: గుండెజబ్బుతో స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న కుమ్మరతోపుకు చెందిన టూవీలర్ మెకానిక్ నరేంద్రబాబుకు శస్త్రచికిత్స నిమిత్తం తిరుపతి టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.40వేల ఆర్థిక సాయం అందించారు. మల్లేశ్వర్, జలందర్, ప్రభు, సోమశేఖర్‌రావు, కృష్ణారెడ్డి, కేశవ, జాకీర్ పాల్గొన్నారు.

త్వరలో ప్రశాంత తిరుపతి

జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్



కిరణ్‌ను ఆత్మీయంగా పలకరిస్తున్న ముస్లిం మత పెద్దలు

తిరుపతి అర్బన్, మే 1: తిరుపతిలో ప్రశాంత వాతావరణ కల్పిస్తామని జనసేన తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ ఓటర్లకు సూచించారు. టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం కిరణ్‌రాయల్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. బుధవారం 28వ డివిజన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ప్రతి ఇంట్లోని ఓటర్లను పలకరించారు. కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోను క్లుప్తంగా వివరించారు. గాజుగ్లాసుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అరాచకాలు, దౌర్జన్యాలకు త్వరలోనే చరమగీతం పాడతామని ప్రజలకు హామీఇచ్చారు. ఈ సందర్భంగా తారసపడిన ముస్లిం మత పెద్దలు కరీముల్లా, అల్లావుద్దీన్‌లు కిరణ్‌ను పలకరించారు. యుక్తవయస్సు నుంచే మెగా కుటుంబంతో కలిసి రాజకీయంగా పోరాతున్నావని, మంచి పదవి లభించాలని, అందుకు అల్లా ఆశీస్సులు ఉంటాయని దీవించారు. అలాగే పలువురు మైనారిటీ సోదరులు కూడా కిరణ్‌ని ఆప్యాయంగా పలకరించారు. జనసేన నేత జయకుమార్, వార్డు అధ్యక్షులు రమేష్‌నాయుడు, టిప్పు సుల్తాన్, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు మూడు ప్రణాళికలతో సిద్ధం కావాలి: ఎస్పీ



కృష్ణకాంత్ పటేల్

తిరుపతి(నేరవిభాగం), మే 1: ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమని, ఏ పార్టీకి కొమ్ముకాయకుండా ప్రతి ఒక్కరూ విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశించారు. ఎస్వీయూ సెనేట్ హాలులో బుధవారం నేర సమీక్షా సమావేశం జరిగింది. ప్రధానంగా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అధికారుల పనితీరు మెరుగుపరచుకోవాలని గట్టిగా చెప్పారు. ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న గ్రేవ్ కేసులు, దర్యాప్తు దశలో వున్న కేసులు, హత్యా యత్నాలు, దారిదోపిడీలు, చీటింగ్, పోక్సో తదితర కేసుల దర్యాప్తు లోతుగా చేసి, నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. అందుబాటులో వున్న అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు అధికారులు నేరం చేసిన వ్యక్తిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని కోరారు. అనంతరం సబ్ డివిజన్ల వారీగా వున్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు ముందే 72 గంటల ముందస్తు ప్రణాళిక, 48 గంటల ముందస్తు ప్రణాళిక, 24 గంటల ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, శ్రీనివాసులు,సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, డీఎస్పీలు శివరామి రెడ్డి, భాస్కరరెడ్డి, సురేంద్ర రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు

తిరుపతి(కలెక్టరేట్), మే 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గానికి కేటాయించబడిన పీవో, ఏపీవోలకు గురువారం శిక్షణా తరగతులు జరుగుతాయని, ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా హాజరు కావాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ నుంచి ఆర్వోలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన పీవో, ఏపీవోలు నేటి శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఓటరు స్లిప్పులను బీఎల్వోలు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఇవ్వాలని ఆదేశించారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో జాగ్రత్తగా ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. అత్యవసర సర్వీసుశాఖ ఉద్యోగులకు 5, 6వ తేదీల్లో పోస్టల్‌బ్యాలెట్ నిర్దేశిత ఫెసిలిటేషన్ సెంటర్ ఉంటుందని, అక్కడ వినియోగించుకోవాలని తెలిపారు. 6, 7వ తేదీల్లో హోం ఓటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు సమాచారం అందించాలని సూచించారు. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాలకు సరిపడ బ్యాలెట్ యూనిట్లు గురువారం చేరుకోనున్నాయని ఆయన తెలిపారు.

ఆరణి కోసం ఆర్సీ మునికృష్ణ విస్తృత ప్రచారం



ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో భవానీ నగర్లో ప్రచారం చేస్తున్న ఎన్డీయే శ్రేణులు

తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను గెలిపించాలని బుధవారం భవానీనగర్లో టీడీపీ 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, యూనిట్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, టీడీపీ నాయకులు హరిబాబు, చిన్ని, హేమాద్రి, సురేష్, సుజాతమ్మ, దర్శన్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, జనసేన డివిజన్ అధ్యక్షుడు రాజేష్ ఆచారి పాల్గొన్నారు.

ఎన్డీఏతోనే సామాజిక న్యాయం: వరప్రసాద్





వరప్రసాదరావును శాలువాలతో సత్కరిస్తున్న కూటమి నాయకులు - తిరుపతిలో ప్రచారం నిర్వహిస్తున్న వరప్రసాద్ సతీమణి కొల్లూరి లక్ష్మి

తిరుపతి (ఉపాధ్యాయనగర్), వెంకటగిరి, గూడూరు, మే 1: ఎన్డీఏతోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని తి రుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు సతీమణి కొల్లూరి లక్ష్మి అన్నారు. తిరుపతి బృందావనం అపార్ట్‌మెంట్‌లో ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ తన భర్త ఎంపీగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేవారని, తిరుపతి అభివృద్ధి ఆయనతోనే జరిగిందన్నారు.

కూటమి మేనిఫెస్టో పేదల కోసమే...

టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టో పేదలను ఆదుకునే విధంగా ఉందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఎన్డీఏ కూటమి నాయకులతో సమావేశమై మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, రూ.4వేల పింఛన్ అందిస్తారని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను ప్రజలకు వివ రించాలన్నారు. ఈ సందర్భంగా వరప్రసాదరావును కూటమి సత్కరించారు.

ఎన్డీఏ నాయకులతో సమావేశం ...

గూడూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎన్డీఏ కూటమి నాయకులతో వెలగపల్లి వరప్రసాదరావు సమావేశమయ్యారు. ప్రచార తీరును సమీక్షించారు. చిల్లకూరు మండల జడ్పీటీసీ సభ్యుడు మన్నెం శ్రీనివాసులు, వరగలి ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, తిప్పనూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, వంకా రమణయ్య, శివ, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో జోరుగా ప్రచారం సాగిస్తున్న అభ్యర్థులను, పార్టీల నాయకులను నిఘా నేత్రం ముచ్చెమటలు పట్టిస్తోంది. కాస్త హంగామాగా ఎక్కువ వాహనాలతో వెళ్దామన్నా ఎన్నికల అధికారులు ఏ మూల నుంచి చూసి లెక్కలు కడుతున్నారోననే భయం వెంటాడు తోంది. అభ్యర్థులు ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ లెక్క పెట్టేందుకు అధికారుల బృందం వీరిని ఇప్పటికే అనుసరి స్తోంది. ప్రతి కదలికను వీడియోలో బంధిస్తోంది. పోలీసు శాఖ కనుసన్నల్లో ఈ నిఘా సాగుతోంది. సభలు, సమావేశాలు, జనసమీకరణకు, లౌడ్ స్పీకర్లకు వెచ్చించే ఖర్చునూ వ్యయ పరిశీలకులు లెక్కిస్తున్నారు. ఖర్చు పరిమితి దాటితే ఎన్నిక చెల్లదంటూ ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం వుంది. దీన్ని దృష్టిలో పెట్టు కుని అభ్యర్థులు జాగ్రత్తలు పడుతున్నారు. మద్యం, సారా, బిర్యానీల లాంటివి పంపిణీ చేస్తున్నప్పుడు రెండో కంటికి తెలియకుండా జాగ్రత్త పడాలని పార్టీ అనుచరగ ణానికి నేతలు పదేపదే చెబుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

ప్రజల నుంచే నాయకులు పుట్టేవారు

● మా రోజుల్లో



నాకిప్పుడు 88 ఏళ్లు. చాలా కాలం నుంచి ఎల క్షన్లు చూస్తున్నాను. ఆనాటి రాజకీయాల్లో ఉన్న రాజసమే వేరు. నాయకులు ప్రజల్లో నుంచి పుట్టే వాళ్లు. సేవ చేసే తత్వం ప్రజలే గుర్తించి నాయకు డిగా వెంట నడుస్తూ ప్రోత్సహించేవారు. అసలు కొంతమంది నిజాయితీపరులైన నేతలు వారికి రాజకీయ మక్కువ లేకపోయినా జనాభిప్రాయం చూసి కాదనలేక ప్రజల బాగోగులను భుజానికి ఎత్తుకునేవారు. అది ఒక బాధ్యతగా పనిచేసే వాళ్ళు. మా రోజుల్లో ఇంతటి ప్రచార ఆర్భాటం ఉండేది కాదు. గ్రామాల్లో ఒక పెద్ద మనిషి ఎలా చెప్తే అలా మాటకు కట్టుబడి ఆ ప్రకారమే ఓట్లు వేసే వాళ్ళం. ఇప్పుడు పరిస్థితులు చూస్తే ఎవరి మాట ఎవరూ పట్టించుకోవడమే లేదు.

- బొక్కిసం పెద్ద మునెయ్య, వేలవేడు, శ్రీకాళహస్తి మండలం

బాబు కోసం స్వదేశానికి..

● నేను సైతం..

గల్ఫ్‌లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన ఎన్ఆర్ఐ వడ్ల మూడి సారథినాయుడు చంద్రబాబునాయుడుపై అభిమానంతో ఈ ఎన్నికలలో తన వంతుగా ప్రచా రానికి వచ్చాడు. చంద్రగిరి మండలంలోని రవణ ప్పగారిపల్లెకు చెందిన ఈయన సౌదీ అరేబియాలో సిరామిక్ కంపెనీలో 20 ఏళ్ళుగా పనిచేస్తున్నాడు. టీడీపీ అన్నా, చంద్రబాబునాయుడు అన్నా వల్ల మాలిన ప్రేమ. సౌదీ అరేబియాలో టీడీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నాడు. స్వదే శంలోని 2304 మందిని ప్రభావితం చేసేలా ఫోన్ కాల్స్ చేసినందుకు చంద్రబాబునాయుడు, లోకేష్‌ల నుంచి ప్రశంసలు అందుకున్నాడు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ సెలవు పెట్టి మరీ తాజాగా స్వస్థలం వచ్చాడు. నేను సైతం అంటూ రోజూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాడు.

- చంద్రగిరి



యువగళం పాదయాత్రలో లోకేష్‌తో సారథినాయుడు

జన  కేతనం


www.andhrajyothy.com

గురువారం 2 మే 2024



తిరుచానూరు సమీపంలో స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు

నాయకులకు మించిన నవరస నటనా సామ్రాట్టులు తెలుగునేలమీద లేరని నిరూపణ అవుతోంది. మొఖంలో అమాయకత్వాన్ని పులుముకుని ఎంతటి అబద్ధాలను అయినా బరితెగించి చెప్పేయచ్చని సీఎం జగన్‌రెడ్డిని చూస్తే అర్థం అవుతుంది. అందుకు ఇసుకే సాక్ష్యం. అధికారంలోకి రాగానే టీడీపీ ప్రభుత్వంలో ఉచితం పేరుతో ఇసుకను దోచేశారంటూ నానా యాగీ చేసి, ప్రజలకు చవగ్గా కోరినంత ఇసుక అందించే విధానం అమలు చేస్తున్నామని ప్రకటించారు. నిజమేనేమో అని నమ్మిన జనాన్ని చూసి వైసీపీ నాయకులు నవ్వుకున్నారు. ఎక్కడికక్కడ రంగంలోకి దిగి ఇసుక తవ్వి నదులను గుల్ల చేశారు. శేషాచలం అడవుల్లో పుట్టి వాకాడు మండలం తూపిలిపాలెం వద్ద సముద్రంలో కలుస్తున్న స్వర్ణముఖి నదిని చూస్తే చాలు వైసీపీ ఇసుకదోపిడీ విశ్వరూపం కనిపిస్తుంది. తరాలుగా తిరుపతి జిల్లా ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చిన స్వర్ణముఖి.. జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లూ వైసీపీ నాయకుల అవినీతి దాహం తీర్చింది. ఈ ఐదేళ్లలోనే స్వర్ణముఖిని పిండి దాదాపు రూ.2000 కోట్ల ఇసుకను వీరు సొమ్ముచేసుకున్నారు.



ఇసుకాసురులకు మళ్లీ ఓట్లేద్దామా?

స్వర్ణముఖిని చెరబట్టారు!

ఐదేళ్లలో రూ. 2 వేల కోట్ల ఇసుక దోపిడీ

అన్నచాటు తమ్ముడి అక్రమార్జన రూ.160 కోట్లు

చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో అధికార పార్టీ ముఖ్యనేత తమ్ముడికి రోజువారీ కప్పం కడితేనే ఇసుక ట్రాక్టర్ కదులుతుంది. లేదంటే స్వర్ణముఖి నది గట్టు కూడా దాటక ముందే పోలీసులో లేక సెబ్ అధికారులో ప్రత్యక్షమవుతారు. ట్రాక్టర్ సీజ్ అవుతుంది. భారీగా జరిమానా పడుతుంది. చంద్ర గిరి మండలంలోని రామిరెడ్డిగారిపల్లి రీచ్ రెండు కంపెనీలకు కేటాయించినప్పటికీ వాటి పేరిట ఇసుక దందా నడుపుతున్నది తమ్ముడు గారేనన్నది బహిరంగ రహస్యం. చంద్రగిరి మండ లంలో 60 ఇసుక ట్రాక్టర్లు ఉన్నాయి. ప్రతి ట్రాక్టర్ ఆపరేటర్ రోజుకు రూ. 3 వేలు చెల్లిస్తేచాలు ఎన్ని ట్రిప్పులైనా తోలుకోవచ్చు. అంటే రోజుకు కప్పం రూ. 1.80 లక్షలు. ఐదేళ్ళలో రూ. 60 కోట్లకు పైగా వసూలు చేసుకునేశారు. ఇక తిరుపతి రూరల్‌లో 200 ఇసుక ట్రాక్టర్లున్నాయి. వీటి నుంచి తమ్ముడి గారి జేబులోకి రోజుకు రూ. 6 లక్షలు పడుతున్నాయి. లెక్కలు కడితే నెలకు రూ. 1.80 కోట్లు.. ఏడాదికి రూ. 21.60 కోట్లు.. ఐదేళ్లలో అన్నగారి అధి కారాన్ని అడ్డుపెట్టుకుని తమ్ముడు దోచుకుంది అక్షరాలా రూ. 108 కోట్లు. రెండు మండలాలూ కలిపితే చిన్నదొర అక్రమార్జన రూ. 160 కోట్ల పైమాటే! ఇది గాక చిన్నా చితకా నేతల దోపిడీ కూడా కలుపుకుంటే రెండు మండలాల్లో రూ. 500 కోట్ల విలువైన ఇసుక గల్లంతైంది.

కోటలో రూ. 210 కోట్ల ఇసుక మేసేశారు



కోట మండలం గూడలి వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాల జోరు

గూడూరు నియోజకవర్గం కోట మండలం గూడలి వద్ద స్వర్ణము ఖిలో ఐదేళ్ళ నుంచీ అక్రమ తవ్వ కాలు జరుగుతున్నాయి. ఇక్కడ 2022 ఫిబ్రవరి నుంచీ 2023 ఏప్రిల్ దాకా 14 నెలల పాటు ఇసుక దోపిడీ యధేచ్ఛగా కొనసాగింది. రోజుకు 80 టిప్పర్లు, 50 ట్రాక్టర్ల లోడ్లు ఇసుక నది నుంచీ వెలికి తీశారు. ఆ లెక్కన 14 నెలల కాలంలో అక్రమంగా తరలించిన ఇసుక విలువ రూ. 210 కోట్లకు పైగా వుంటుందని అంచనా. అందులో సగానికి పైగా అధికార పార్టీ నేతల జేబుల్లోకి చేరిందని సమాచారం.

టిప్పర్లను పట్టించినా అధికారులు వదిలేశారు

గూడూరు నియోజకవర్గం కోట మండలం గూడలి వద్ద అక్రమ ఇసుక తవ్వకాలతో విసిగిపోయిన గూడలి, దనుపాలెం, దక్షిణపాలెం, తిన్నెలపూడి గ్రామాల ప్రజలు 2023 ఫిబ్రవరిలో తవ్వకాలను అడ్డుకున్నారు. రెవెన్యూ అధి కారులు రంగప్రవేశం చేసి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే అధి కార పార్టీ నేతల ఒత్తిడితో తర్వాత వాటిని విడిచిపెట్టేశారు.



తొట్టంబేడు మండలం విరూపాక్షపురం వద్ద స్వర్ణ ముఖిలో ఇసుక తవ్వకాల ధాటికి తాగునీటి పైపు లైన్ బయటపడడంతో పాటు దెబ్బతిన్న దృశ్యం - ఏర్పేడు మండలం వికృతమాల వద్ద స్వర్ణముఖి నదిలో ఎంత లోతున ఇసుక తవ్వకాలు సాగించారనే దానికి నిదర్శనంగా గట్టుపై నిలిచిన చెట్టు

శ్రీకాళహస్తిలో రూ. 700 కోట్ల ఇసుక ఎత్తేశారు!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు కూడబలుక్కుని గత ఐదేళ్ళ వ్యవధిలో (కొవిడ్ ఏడాది తప్ప) సుమారు రూ.700 కోట్ల విలు వైన ఇసుకను స్వర్ణముఖి నది నుంచీ ఎత్తేసినట్లు అంచనా. రేణిగుంట మండలంలో అధికారిక రీచ్‌లు లేవు. అయితే కొత్రమంగళం నుంచీ జీపాలెం దాకా పది కిలోమీటర్ల పొడవునా స్వర్ణముఖి నదిలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ మండలంలో 200 ఇసుక ట్రాక్టర్లు నడుస్తున్నాయి. ఒక ట్రాక్టరు రోజుకు ఏడు ట్రిప్పులు తిరుగుతుంది. ప్రతి ట్రాక్టర్ ఆపరేటర్ రోజుకు రూ. 3 వేల చొప్పున ముడుపులు చెల్లించాలి. ఆ లెక్కన నాలుగేళ్ళ వ్యవధిలో రూ. 80 కోట్లకు పైగా ముడుపులు చెల్లించారు. ఇక్కడ అధికా రిక రీచ్‌లు లేకపోయినా ఓ కంపెనీ పేరు చెప్పుకుని దాని పేరిట రశీదులిస్తూ కొందరు ముడుపులు వసూలు చేస్తున్నారు. వారు ఉమ్మడి జిల్లాలో పెత్తనం చెలాయిస్తున్న ఓ బడా నేత ప్రతినిధులు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడొకరి కుమారుడు బడా నేత తరపున వసూల్ రాజాగా వ్యవహరిస్తు న్నారు. ఇక ఏర్పేడు మండలం పెనుమల్లం, పెన గడం, వికృతమాల, గోవిందవరం, మునగలపాలెం, కోబాక, కొత్త వీరాపురం, మునలిపేడు, మడిబాక గ్రామాల వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. నియోజకవర్గ ముఖ్యనేత సన్ని హిత బంధువు ఈ దందా వెనుక కీలక పాత్ర పోషి స్తున్నారు. ఇక్కడి నుంచీ టిప్పర్లలో చెన్నైకి ఇసుకను తరలిస్తున్నారు. ఈ మండలం నుంచీ అధికారపార్టీ నాయకులే రూ. వంద కోట్ల వరకూ వెనకేసుకున్నా రన్న ప్రచారం వుంది. శ్రీకాళహస్తి మండలం రామ లింగాపురం, వేడాం, రామాపురం, చుక్కల నిడిగల్లు, పుల్లారెడ్డి కండ్రిగ, పట్టణ శివారులోని వాటర్ హౌస్ కాలనీ తదితర చోట్లా, అలాగే తొట్టంబేడు మండలం విరూపాక్షపురం, పెన్నలపాడు, చేమూరు, కనపర్తి తదితర చోట్లా స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నియోజకవర్గం మొత్తంలో దోచు కున్న ఇసుకలో స్థానిక నేత వాటా దాదాపు రూ.250 కోట్లు అని అంచనా. మిగతా సొమ్ము జిల్లా పెద్దలు దబాయించి కొట్టేశారని అంటున్నారు.

రౌడీషీట్ తెరిచారు!

రేణిగుంట మండలంలో రీచ్‌లు లేకపోయినా తొలుత ట్రాక్టరుకు రోజుకు రూ. వెయ్యి వసూలు చేశారు కొందరు అధికార పార్టీ నాయకులు. అయితే 2022 ఏప్రిల్‌లో ఆ మొత్తాన్ని హఠాత్తుగా రూ. 3 వేలకు పెంచేశారు. దీంతో ఒళ్ళు మండిన ట్రాక్టర్ ఆపరేటర్లు అదే నెల 13న మూకుమ్మడిగా గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనలో బడా నేత ప్రతినిధుల ఒత్తిడితో పోలీసులు ట్రాక్టర్ ఆపరేటర్ల ఆందోళనకు నాయకత్వం వహించిన వ్యక్తిపై రౌడీషీట్ తెరిచారు.

ఇసుక గోతిలో పడి ఇద్దరు మృతి

రేణిగుంట మండలం జీపాలెం గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు భారీ ఎత్తున జరగడంతో అంతేస్థాయిలో గోతులు ఏర్పడ్డాయి. 2022 ఆగస్టులో ఇద్దరు యువకులు నదిలోకి దిగి ప్రమాదవశాత్తూ ఓ గోతిలో పడి మృతి చెందారు.

ఏర్పేడులో ఏడుగురిపై ఎదురు కేసు

ఏర్పేడు మండలంలో వైసీపీ ప్రభుత్వం రాగానే ఇసుక అక్రమ దందా మొదలైంది. 2019 సెప్టెంబ రులో పెనుమల్లం గ్రామం వద్ద ఇసుక అక్రమ రవాణాను స్థానిక టీడీపీ నేత నిరంజన్ నాయుడు అడ్డుకున్నారు. దీంతో అధికార పార్టీ నాయకులు తిరిగి ఆయన మీదే కేసుపెట్టారు.

చిట్టమూరులో ఛిద్రం చేశారు!



చిట్టమూరు మండలం మెట్టు వద్ద నిబంధనలను ఉల్లంఘించి రెండు మూడు రెట్లు లోతుగా ఇసుక తవ్వేసిన తీరును స్కేల్ పెట్టి మరీ చూపుతున్న గ్రామస్తులు

గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్టమూరు మండలంలో అక్రమ ఇసుక తవ్వకాలతో స్వర్ణముఖి నది ఛిద్రమైంది. ఇక్కడ మెట్టు వద్ద అధికారిక రీచ్ లో 13.85 ఎకరాల్లో తవ్వకాలకు జేపీ కంపెనీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ పరిధి దాటి తవ్వ కాలు సాగించారు. మీటరు లోతుకి మించి తవ్వకూ డదనే నిబంధన ఉన్నా 20 అడుగుల లోతు వరకూ తవ్వేశారు. రోజుకు సుమారు రూ. కోటి విలువైన ఇసుకను తరలించేశారు. ఆ లెక్కన 2023 జనవరి నుంచీ ఈ ఏడాది మార్చి వరకూ 15నెలల కాలంలో రూ. 450 కోట్ల విలువైన ఇసుక తవ్వి తీశారు. ఈ ఇసుకను స్థానికంగా విక్రయించకుండా చెన్నైకి తర లించి అధిక సొమ్ము చేసుకున్నారు. ఇష్టారాజ్యంగా జరిపిన ఈ తవ్వకాలతో మెట్టు వద్ద స్వర్ణముఖి నది భారీ గోతులతో అస్తవ్యస్తంగా తయారైంది.

పెళ్ళకూరులో 22 రోజుల్లో రూ. 20 కోట్లు స్వాహా

సూళ్ళూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, కలవకూరు, పుల్లూరు, ముమ్మారెడ్డి గుంట, రావులపాడు, చిల్లకూరు గ్రామాల వద్ద స్వర్ణముఖిలో ఇసుక అక్రమ తవ్వ కాలు జరుగుతున్నాయి. వీరంతా స్థానికంగా విక్ర యించేవారే. అయితే జయప్రకాష్ పవర్ వెంచర్స్ సంస్థ తాళ్వాయిపాడు వద్ద ఇసుక తవ్వకాలకు 2022 ఏప్రిల్‌లో అనుమతులు తెచ్చుకుంది. దీనిని గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్కడ తవ్వకాలు ఆపే సినా, అనుమతులులేని జీలపాటూరు-కప్పగుంట కండ్రిగ గ్రామాల నడుమ నదిలో తవ్వకాలు మొద లుపెట్టారు. రోడ్డుపై కాజ్‌వే నుంచీ మొదలుపెట్టి నదిలో కిలోమీటరు వరకూ తవ్వుకుంటూ వెళ్ళిపో యారు. ఇసుక తవ్వకాల కోసం ఏకంగా నదిలో అప్రోచ్ రోడ్డే నిర్మించేశారు. పలుసార్లు రెండు గ్రామాల రైతులు అడ్డుకున్నా పోలీసులు జోక్యం చేసుకుని గ్రామస్తులను వెళ్ళగొట్టారు. దీంతో విసిగి పోయిన జీలపాటూరు సర్పంచ్ కందమూడి శివకు మార్ రైతులతో కలసి హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేని చోట తవ్వకాలు జరపడంపై అభ్యం తరం వ్యక్తం చేసిన హైకోర్టు తవ్వకాలు నిలిపివే యాల్సిందిగా ఆదేశించింది. ఈలోపు కేవలం 22 రోజుల వ్యవధిలోనే రూ. 20 కోట్లకు పైగా విలువైన ఇసుకను కొల్లగొట్టేశారు. రోజుకు 150 హెవీ టిప్పర్ లోడ్లు చెన్నైకి తరలించి సొమ్ము చేసుకున్నారు.

అన్నమేడులో నదిని కాపాడుకున్నారు

నాయుడుపేట మండలంలో తమకు అనుమతులు వున్నాయంటూ అన్నమేడు, మడపలం గ్రామాల వద్ద ఇసుక తవ్వకాలకు రంగంలోకి దిగిన (చిత్తూరు జిల్లాలో చక్రం తిప్పే) ఓ మంత్రి అనుచ రులకు రెండు గ్రామాల ప్రజలు చుక్కలు చూపిం చారు. స్థానిక సమస్య కావడంతో అధికార పార్టీ నాయకులతో సహా అన్ని పార్టీల వారూ ఒక్కట య్యారు. మంత్రి అనుచరుల వాహనాలను కూడా గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. తమ ప్రాంత భూగర్భజలాల సంరక్షణకు ఉపయోగపడే స్వర్ణముఖి నదిలో ఇసుకను కాపాడుకున్నారు.



వాకాడు మండలం కాశీపురం, జాంద్రపేటల వద్ద హై టెక్నాలజీ వినియోగించి నీరున్నా ఇసుక తోడుతున్న దృశ్యం

వాకాడులో నీళ్లలోంచి ఇసుక తోడారు

గూడూరు నియోజకవర్గం వాకాడు మండలం కాశీపురం, జాంద్రపేటల వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు కొత్త ఒరవడి సృష్టించాయి. వెంకటగిరికి చెందిన వైసీపీ కీలక నేత చెన్నై నుంచీ పేరుమోసిన కాంట్రాక్టరును రంగంలోకి దించారు. ఆ కాంట్రాక్టరు రోజువారీ 50 లారీలు, 70 ట్రాక్టర్ల ఇసుకను చెన్నైకి తరలించారు. 2022 మార్చిలో మొదలైన అక్రమదందా అదే ఏడాది నవంబరు దాకా కొనసా గింది. ఆ నెలలో వర్షాలకు నదిలోకి నీరు చేరడంతో నెల పాటు పనులు ఆపేశారు. డిసెంబరులో నీరున్నప్పటికీ హై టెక్నాలజీ బోట్లు ఉపయోగించి 50 అడుగుల లోతు నుంచీ మోటర్లతో ఇసుకను వెలికి తీశారు. భూగర్భ జలాలు తగ్గుతున్నా యని ఆందోళనకు గురైన కొండాపురం, కాశీపురం, జాంద్రపేట గ్రామాల రైతులు 2023 మార్చిలో ఇసుక తవ్వకాలను అడుకున్నారు. అప్పటికే సుమారు రూ.120 కోట్ల విలువైన ఇసుకను చెన్నైకి తరలించేశారు.

వాటాలేసి పంచుకున్న బడా నేతలు

జిల్లాలో గత ఐదేళ్ళుగా అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్న ఇసుక దోపిడీలో బడా నేతల ప్రమేయం వుంది. కడపకు చెందిన సీఎం సన్ని హిత బంధువు ఒకరు మొదలుకుని నెల్లూరు జి ల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి దాకా పలువురు బల మైన నేతలు భారీగా లబ్ధి పొందినట్టు ప్రచారం జరిగింది. తవ్వకాలు జరిగే చోట, డంప్‌ల వద్ద, టిప్పర్లు, ట్రాక్టర్ల ఆపరేటర్ల వద్ద వసూళ్ళు చేసే చోట్ల వీరి సన్నిహిత అనుచరులు మకాం వేసి వుండడమే వారి ప్రమేయానికి నిదర్శనమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అక్రమార్జ నలో వీరికి సింహభాగం పోనూ ఆయా నియోజక వర్గ ముఖ్యనేతలకు ఓ భాగం, తవ్వకాలు జరిగే మండల, గ్రామాల నేతలకు వారి వంతు వాటా దక్కుతున్నట్టు సమాచారం. మొత్తానికి ఎవరికీ సమాధానం చెప్పకుండా పోలీసు అండతో స్వర్ణ ముఖిలో ప్రకృతి ప్రసాదించిన ఇసుకను కొల్లగొట్టి అధికార పార్టీ నేతలు కోట్లకు పడగలెత్తిన వైనం జిల్లా ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది.

ఓసీ కాసులు ఎందుకు కొదులుకోవల్ల !



ప్రెచారాలు జోరుగా సాగతా వుండాయిగదా ఇప్పుడు. కూలీ కాసులు గూడా బాగానే ముడతా వుండాయంట. ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా ఏ పార్టీ ఎప్పుడు ప్రెచారాలకీ, ర్యాలీలకీ పిలిస్తే వోటికి జనం పొలోమంటా ఎల్లిపోతా వుండారు. అర్దపూటో లేకపోతే రెండుమూడు గంటలో మాత్రమే ఉంటాయి ఏ ప్రెచారమైనా. ఇంతమాత్రానికే దినానికి ఐదు నూర్లు కాసులు, బిరియానీ ప్యాకెట్లు ఇస్తారు. మొగోళ్లకయితే క్వార్టరు మొందు బాటిలు ఎక్స్ట్రా. అందుకే పార్టీలమజ్జ తేడాలు చూపడంలేదు జనం. తాము ఓటు ఏసేది ఎవుర్కైనా పిలిస్తేసాలు పార్టీ ఏదని చూడకుండా పొలోమని ఎల్లిపోతా వుండారు. ఈ మజ్జ కుప్పంలో జరిగే ర్యాలీకి శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో అధికార పార్టీ జనాన్ని కూడే సింది. వాళ్లల్లో పక్కా టీడీపీ ఓటర్లు శానామందే ఉండారు. తాము వైసీపీ ర్యాలీకి ఎల్లినట్లు తెలిస్తే, టీడీపీ నాయకులు ఏమనుకుంటారో ఏంపాడో అని వాళ్లల్లో వారికే శంక అయిపొయ్యింది. అప్పుడు పార్టీ నాయకులకు వాళ్లనింకా ఫోన్లు వొచ్చినాయి. 'మేము వైసీపీ ర్యాలీకి ఎల్తావుండామప్పా. మనిషికి ఐదొందలు ఇచ్చినారు. బిరియానీ ప్యాకెట్లు కూడా ఇస్తారంట. మొగోల్లకు క్వార్టరు బాటిలు చేతిలో పెడ్తామని చెప్తావుండారు. ఊరికే వొచ్చే కాసులు, ఎందుకు కాలదన్నుకోవల్ల సెప్పండి? కానీ నత్తి ప్రెమానికంగా చెప్తావుండామప్పా. ఓటు మాత్రం మన సైకిలుమిందే గుద్దతాము' అని ఫోన్లుచేసి సెప్పి ప్రెమాణాలు గూడా సేసినారంట. వైసీపీ పార్టీవోల్లకు కూడా ర్యాలీకి వొచ్చిన జనంలో నగంమంది ఓట్లు తమకు పడేవి కావని తెలిసినా.. జనం కావల్ల కాబట్టి తెలియనట్లే గమ్మున ఐదు నూర్లు కాసులు పంచేసి పిల్సకపొయ్యినారంట.

\- కుప్పం

● మీకు తెలుసా?

ఖైదీలకూ ఓటు

రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాల వల్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా... ఉండదా అనే ప్రశ్న చాలా మంది తలెత్తవచ్చు. అయితే ఖైదీలకు కూడా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. వివిధ నేరాల్లో జైలు శిక్షలు అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయొచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ, తాము ఓటర్లమని, పోలింగ్ బూత్, ఓటరు క్రమసంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాతపూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పిస్తారు.

\- చిత్తూరు

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు




ఎన్నికల అధికారులు మూడు రకాలుగా పోలింగ్ కేంద్రాలను విభజించారు. మొదటిది సాధారణ.. రెండోది సమస్యాత్మక. మూడోది అత్యంత సమస్యాత్మకమైనవి. రాజకీయ పార్టీలు, తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు, ఇతరేతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ విభజన జరిగింది.

● నోట్ దిస్ పాయింట్

సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించి జియోట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసివుంటారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

\- చిత్తూరు కలెక్టరేట్

జన కేతనం




నాయకుడికి దూరచూపు ఉండాలి. అభివృద్ధికి అర్థం తెలియాలి. విజన్ కొరవడిన పాలన వర్తమానంలో కూరుకుపోతుంది. భవిష్యత్ తరాలకు ద్రోహం జరుగుతుంది. అభివృద్ధి అంటే ఓట్లలెక్కలు కాదు. అభివృద్ధి అంటే కరెంటు ఛార్జీలు పెంచి, పన్నులు పెంచి, ధరలు పెంచి, మద్యం ఏరుల్లా పారించి... ఎడాపెడా బాదేసి సంక్షేమం అంటూ నగదు విదిల్చడం కాదు. అభివృద్ధి అంటే చదువుల పందిరి వేయడం. అభివృద్ధి అంటే ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం. అభివృద్ధి అంటే ఉపాధికి బాటలు పరవడం.. మరి ఒక్క ఛాన్స్‌తో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి చేసిందేమిటి? పాదయాత్రలో జిల్లా పారిశ్రామికాభివృద్ధిపై చెప్పిన మాటలన్నీ ఆచరణలో అమలయ్యాయా? అంతకుముందు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏం చేశారు? జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఇద్దరు నేతల ముద్రలేమిటో చూద్దాం...

చిత్తూరు, ఆంధ్రజ్యోతి



విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు ఉన్న పేరు 2014-19 నడుమ నిజం అని రుజువైంది. విభజన తర్వాత రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక రంగాన్ని ఎంచుకున్నారు. ఫలితం.. ఆ ఐదేళ్లలో దేశ, విదేశీ, బహుళ జాతి కంపెనీలెన్నో కొలువు దీరాయి. 2014-19 నడుమ లక్ష మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. ప్రజల జీవన ప్రమాణాలూ వృద్ధి చెందాయి.



2019 ఎన్నికల్లో గెలిచి జగన్‌రెడ్డి సీఎం అయ్యారు. అప్పటి దాకా ఉమ్మడి జిల్లాలో పనులు మొదలు పెట్టని పరిశ్రమల యాజమాన్యాలన్నీ ఏర్పాటు ప్రతిపాదనలను విరమించుకున్నాయి. కొత్త ప్రతిపాదనలూ లేవు. ఉన్నవి తప్పితే అదనంగా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు. అనేక పరిశ్రమలు విస్తరణను విరమించుకున్నాయి. రిలయన్స్ జియో వెనక్కివెళ్లింది. అమరరాజ పొరుగు రాష్ట్రాలకు పారిపోయింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం పాలనా తీరుకు కొలబద్దగా ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి స్తంభించిపోయింది.

2019-24 జగన్ పాలనలో చీకట్లు

కుప్పంలోనే 8 సంస్థలు వెనక్కి

వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన యాజమాన్యాలతో చర్చించలేదు. పైగా ఉన్న పరిశ్రమల మీద కక్ష సాధింపు చర్యలకు దిగారు. ఈ పరిణామాలను చూసిన వారంతా పరిశ్రమల స్థాపనకు ముందుకు రాలేదు. కుప్పం నియోజకవర్గంలోనే దాదాపు రూ.3 వేల కోట్ల పెట్టుబడులు ఆగిపోయాయి. బ్రిటానియా, ఆదిత్యా బిర్లా, వైష్ణవి మెగా ఫుడ్‌పార్కు, తిరుపూర్ గార్మెంట్స్ వంటి ఎనిమిది సంస్థలు రాలేదు. ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై పాదయాత్రలో ఇచ్చిన హామీలనూ జగన్ నెరవేర్చలేదు.

జిల్లా పారిశ్రామిక చిత్రపటం

అక్కడితో వదిలేశారు



గంగాధరనెల్లూరులో టీడీపీ ప్రభుత్వం పరిశ్రమల కోసం 25 ఎకరాలను తీసుకుని రహదారులు అభివృద్ధి చేసి, విద్యుత్తు సౌకర్యం, మౌలిక వసతులు కల్పించింది. అప్పట్లో ఐదు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వైసీపీ వచ్చిన ఈ ఐదేళ్లలో ఇటువైపు కన్నెత్తి చూసేవాళ్లు లేరు. ఇంకా సుమారు 20 ఎకరాల స్థలమున్నా ఇతర పరిశ్రమల ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం చొరవ చూపలేదు.

'గుండ్రాజుపల్లె'ను విస్మరించారు

గంగవరం మండలం గండ్రాజుపల్లెలో 482 ఎకరాల భూమిని రూ.96 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కర్ణాటక సరిహద్దున ఉన్న ఈ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పిస్తే పరిశ్రమలు ఏర్పాటవుతాయి. తద్వారా యువతకు ఉపాధితో పాటు, ఈ ప్రాంతమూ అభివృద్ధి చెందేది. ఈ దిశగా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

2014-19 చంద్రబాబు హయాంలో వెలుగులు



టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాకు పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చాయి. రూ.19452 కోట్లతో పెద్ద, భారీ, చిన్న పరిశ్రమలు లక్ష మందికిపైగా ఉపాధి కల్పించాయి. వీటితో పాటు రూ.2200 కోట్ల పెట్టుబడితో 3 వేల ఎంఎస్ఎంఈలు సుమారు 60 వేల మందికిపైగా ఉపాధిని ఇస్తున్నాయి. టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటైన 11 ప్రసిద్ధ పరిశ్రమలు గురించి చెప్పుకుంటే.. సత్యవేడులో హీరో మోటార్స్, ఏర్పేడులో రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్, సన్నీ ఒపో టెక్, శ్రీసిటీలో యూఎస్‌జీ బోరాల్స్, టాటా స్మార్ట్ ఫుడ్, సుందరం ఫాస్టనర్స్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్, టీవీఎస్ బ్రేక్స్ ఇండియా లిమిటెడ్, గంగవరం మండలం గండ్రాజుపల్లెలో ఫామ్‌గేట్, విశ్వ అపరైల్స్, తొట్టంబేడులో కజారియా ఇండస్ట్రీస్ ఉన్నాయి. ఇక, సెల్‌ఫోన్లు, టెలివిజన్ సెట్ల తయారీలో అతిపెద్ద మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు సెల్‌కాన్, ఫాక్సన్, డిక్సన్ వంటివి తిరుపతి, శ్రీసిటీలో ఉన్నాయి. ఫైర్‌మ్యాక్స్, గ్రీన్‌ప్లే, మొండెలేజ్, ఇసుజి, కోల్గేట్, కెలోగ్స్, షాహి ఎక్స్‌పోర్ట్స్ వంటి అతి భారీ పరిశ్రమలూ ఏర్పాటయ్యాయి. అమరరాజా విస్తరణలో భాగంగా యాదమరి మండలంలోనూ ప్లాంట్‌ను నెలకొల్పారు.

ఉమ్మడి జిల్లాలో పెద్ద, భారీ తరహా పరిశ్రమల ప్రగతి ఇలా

సంవత్సరం	పెట్టుబడులు (రూ.కోట్లలో..)	పరిశ్రమలు
2014-15	235	1,611
2015-16	398	2,104
2016-17	491	2,941
2017-18	826	2,377
2018-19	1076	10,419
మొత్తం	3,026	19,452



● ఇక, టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద, భారీ పరిశ్రమలు 2135 వచ్చాయి. వీటి ద్వారా 1,29,619 మంది ఉపాధి పొందారు.

ఒక్క భారీ పరిశ్రమా తేలేకపోయిన వైసీపీ

జిల్లాల పునర్విభజనతో భారీ పరిశ్రమలు, విద్యాసంస్థలు తిరుపతి జిల్లాలో ఉండిపోయాయి. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాను అభివృద్ధి చేయడంపై ఇక్కడి మంత్రులు, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టలేదు. 2023లో రూ.90 కోట్లతో 651.. 2022లో రూ.13.74 కోట్లతో 334 ఎంఎస్ఎంఈ పరిశ్రమలు ప్రారంభించామని గతేడాది ఆగస్టు 15న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉషశ్రీచరణ్ తన ప్రసంగంలో చెప్పారు. క్షేత్రస్థాయిలో వీటి పరిస్థితి ఏంటో మరి. ఇక, ఒక్కటంటే ఒక పెద్ద పరిశ్రమ జిల్లాకు రాలేదని అధికారికంగా అంగీకరించారు.

'కోసలనగరం'నూ పట్టించుకోలేదు



తమిళనాడు సరిహద్దు అయిన విజయపురం మండలం కోసలనగరంలో పరిశ్రమల స్థాపనకు టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాటి ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు చొరవతో.. 2017లో 650 ఎకరాలు, 2018లో 1520 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించారు. 200 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు కొందరు పారిశ్రామికవేత్తలు ఎంవోయూ చేసుకున్నారు. నీళ్లు, కరెంటు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. దీనికోసం కృష్ణయ్య కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలుగుగంగ నీటిని శ్రీహరిపురం చెరువుకు తీసుకొచ్చి.. అక్కడ్నుంచి ఎత్తిపోతల ద్వారా ఈ పారిశ్రామిక వాడకు నీటి వసతి కల్పించాలని నిర్ణయించారు. విద్యుత్ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పరిశ్రమల గురించి పట్టించుకోలేదు. కాకుంటే, ఇటీవల 29 మంది రైతులకు భూమికి సంబంధించి పరిహారం ఇచ్చారు. మామిడి చెట్లకు ఇవ్వలేదని చెబుతున్నారు. ఇక, నగరి మండలం వీకేఆర్‌పురం పంచాయతీలో 250 ఎకరాలను టీడీపీ హయాంలోనే సేకరించారు. ఇక్కడా పరిశ్రమల ప్రస్తావన లేదు. ఈ ఐదేళ్లలో రైతులకు పరిహారం ఇచ్చి, మౌలిక వసతులు కల్పించి పరిశ్రమలను తీసుకొచ్చేందుకు మంత్రి రోజా చొరవ చూపలేదు. దీంతో 10 వేల మందికిపైగా ఉపాధి లేకుండా పోయింది.

\- నగరి

అమరరాజను వేధించి వెళ్లగొట్టారు

రేణిగుంట మండలం కరకంబాడి వద్ద 1985 డిసెంబరులో గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి దంపతులు అమరరాజా బ్యాటరీస్‌ను స్థాపించారు. రూ.11 వేల కోట్లకు పైగా వార్షిక టర్నోవర్‌తో నడుస్తున్న ఈ పరిశ్రమ జిల్లాలో 16 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. వైసీపీ అధికారంలోకి రావడంతోనే అమరరాజపై వేధింపులు మొదలయ్యాయి. యాదమరి మండలం నూనెగుండ్లపల్లె వద్ద కూడా అమరరాజా సంస్థ బ్యాటరీల తయారీ ప్రారంభించింది. ఈ రెండు చోట్లా తొమ్మిది యూనిట్ల వల్ల కాలుష్యం ఏర్పడుతోందంటూ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జారీ చేసిన ఆదేశాలతో 2021 మే 1న ఎస్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో సంస్థకు రూ.50 కోట్ల మేర నష్టం వాటిల్లింది. తర్వాత కూడా వేధింపులు కొనసాగాయి. దీంతో జిల్లాలో రూ.9500 కోట్లతో నెలకొల్పాల్సి ఉన్న లిథియం బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఆ సంస్థ తెలంగాణకు తరలించింది. దీనివల్ల జిల్లాలోని 4500 మంది ఉపాధి కోల్పోయారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా వున్న వాటిని వెళ్లగొట్టేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుపై జనం మండిపడుతున్నారు.



తూచ్...!

ఒక్క పరిశ్రమా ఏర్పాటు కాలేదు

● పుంగనూరులో భూసేకరణ, శంకుస్థాపనలతోనే సరి

పుంగనూరులో 2,200 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటవుతుంది. ఉద్యోగ, ఉపాధి కోసం యువత ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు.

అలాగని చెప్పి మూడు చోట్ల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఒక్క దానికి కూడా అడుగులు పడలేదు.

\- పుంగనూరు



శంకుస్థాపనతో సరి

పరిశ్రమ పేరు: జిక్సిన్ వారి సిలిండర్లు, బ్యాటరీల తయారీ, **సేకరించిన భూములు:** 38 ఎకరాలు
ఎక్కడ: పుంగనూరు మండలం మిట్టచింతలపల్లె వద్ద, **పెట్టుబడి:** రూ.57 కోట్లు ,**ఉపాధి:** 900 మందికి
శంకుస్థాపన జరిగింది: 2021 జూలై ఒకటో తేదీ. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప, కంపెనీ ఎండీ రాహుల్ కరణం శంకుస్థాపన పాల్గొన్నారు.

ఆ తర్వాత ఏం జరిగింది

కంపెనీ ఎండీ రాహుల్ హత్యకు గురయ్యారు. పరిశ్రమ అటకెక్కింది. ఆ స్థలం నిరుపయోగంగా ఉంది.

ఏడాదిగా ఇంతే

పరిశ్రమ పేరు: ఫెర్రో అల్లాయ్స్ డీఐ పైపుల పరిశ్రమ
కేటాయించిన స్థలం: 62.47 ఎకరాలు
పెట్టుబడి: రూ.165 కోట్లు
ఎక్కడ: పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద
శంకుస్థాపన చేసింది: 2023 మార్చి 24న
ఉపాధి: ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 600 మందికి
తర్వాత ఏం జరిగిది: పరిశ్రమ ఏర్పాటుకు పక్కనే యుద్ధప్రాతిపదికన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. ఆ తర్వాత ఎలాంటి నిర్మాణాలు జరగలేదు.





శంకుస్థాపన చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి(ఫైల్‌ఫొటో)



గాయత్రి సిలెండర్ల ఫ్యాక్టరీకి వేసిన శిలాఫలకం, స్థలం

అనుమతి లేకుండానే..!

పరిశ్రమ పేరు: గాయత్రి సిలెండర్స్ ప్రైవేటు లిమిటెడ్
పారిశ్రామిక వేత్త: మదనపల్లెకి చెందిన వైసీపీ నేత జబ్బల శ్రీనివాసులు
శంకుస్థాపన జరిగింది: ఆరడిగుంట వద్ద 2022 ఆగస్టు 21వ తేదీ
ఆ తర్వాత ఏమైంది: ప్రభుత్వ అనుమతిలేకుండానే ప్రక్రియ నడిచింది. చివరకు భూమి నిరుపయోగంగా, శిలాఫలకం దిష్టిబొమ్మగా కనిపిస్తోంది.

ఎన్నికల ముందు పరిశ్రమల పేరిట హడావిడి

తన నియోజకవర్గంలోనే మూడు పరిశ్రమలకు భూసేకరణ జరిపి వదిలేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఎన్నికలకు ముందు మరోసారి పరిశ్రమల హడావిడి చేశారు. భూసేకరణ పేరిట గ్రామస్థులను ఆందోళనకు గురిచేశారు.

పరిశ్రమ పేరు: జర్మనీకి చెందిన పెప్పర్‌మోషన్ ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల తయారీ, **స్థల పరిశీలన:** గతేడాది డిసెంబరు ఒకటో తేదీ
ఎక్కడ: పుంగనూరు మండలం గోపిశెట్టిపల్లె సమీపంలోని 800 ఎకరాల్లో
పెట్టుబడి: రూ.5 వేల కోట్లు, **ఉపాధి:** 10 వేల మంది
విస్తరణ: రెండు వేల ఎకరాల్లో మరో పది కంపెనీలు
లక్ష్యం: 2027కు మార్కెట్‌లోకి 50 వేల వాహనాలు తేవడం
ఏమైంది: ఇంత ఆర్భాటం చేసి, సీఎం జగన్‌ను రెండుమార్లు కలిసినా ఇంతవరకు పరిశ్రమ ఊసేలేదు., **గ్రామంలో పరిస్థితి:** మా ప్రాణాలు పోయినా భూములివ్వబోమని రైతులు తేల్చి చెప్పారు. బలవంతంగా భూములు తీసుకుంటే మాకు చావే గతి అన్నారు. ఆందోళనలు చేశారు.



జర్మనీ పెప్పర్‌మోషన్ ఎలక్ట్రిక్ వాహన తయారీ పరిశ్రమ స్థాపన స్థలాన్ని పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు(ఫైల్‌ఫోటో)

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి


ముని కుమార్ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, మే 1: శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో అనుమానాస్పద స్థితిలో ముని కుమార్(28) అనే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. రాజీవ్ నగర్ కాలనీకి చెందిన మునికుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. సూళ్లూరుపేట వద్ద ప్రైవేట్ కంపెనీలో పనిచేసే ఓ యువతితో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. ఇద్దరూ సహజీవనం సాగించేవారు. బుధవారం ఇద్దరికీ గొడవ జరగడంతో యువతి ఇంటి బయట చెట్టు కింద నిద్రించింది. అదే సమయంలో... ఇంట్లో మునికుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా బంధువులకు సమాచారం అందించింది. మునికుమార్ మృతిపై అతని స్నేహితులు కొందరు అనుమానాలను వ్యక్తం చేస్తూ 100కు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు రాజీవ్‌నగర్‌కు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నుంచి ఆరుగురి సస్పెన్షన్

బుచ్చినాయుడుకండ్రిగ, మే 1: స్వతంత్ర్య అభ్యర్థి రమేష్‌బాబుకు అనుకూలంగా ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు ఆరుగురిని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు బుధవారం తెలిపారు. ఎంపీటీసీ మనోహర్ నాయుడు(వేణుగోపాలపురం), తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు ఉషారాణి(బీఎన్‌కండ్రిగ), నీర్పాకోట బూత్ ఇన్‌చార్జి మునిసుబ్బయ్య, దామర్ల మునెయ్య యూనిట్ ఇన్‌ఛార్జి కరకంబట్టు, కాంపాళెం గ్రామానికి చెరందిన యూనిట్ ఇన్‌ఛార్జి సత్యనారాయణను పార్టీ నుంచి తొలగించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


మృతి చెందిన వృద్ధురాలు

కేవీబీపురం, మే 1: మండలంలోని మఠం గ్రామ సమీపంలో ఉన్న దంపింగ్ యార్డు వద్ద సుమారు 70 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెందింది. ఎస్‌ఐ నజీరుద్దీన్, ఏఎస్‌ఐ లోకనాథం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. దీంతో ఆమె మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. మృతురాలికి సంబంధించిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఏపీటీఎఫ్ నేత మృతి


జయరాం (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, మే 1: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ దావాల జయరాం అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీకాళహస్తికి చెందిన ఆయన పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. అనారోగ్యంతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

బీజేపీ, వైసీపీ ఓటమి తథ్యం: చింతా మోహన్

తొట్టంబేడు, మే 1: ప్రజావ్యతిరేక విధాలను అవలంబిస్తున్న బీజేపీ, వైసీపీలను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తేజోవతి, యుగంధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గురు సంక్రమణ పూజలకు అంకురార్పణ


గురుదక్షిణామూర్తి సన్నిధిలో కలశ స్థాపన పూజలు

శ్రీకాళహస్తి, మే 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురు సంక్రమణ పూజల కోసం బుధవారం అంకురార్పణ చేశారు. నవగ్రహాలలో పంచముడైన గురు గ్రహం రాశి మారే సమయాన్ని సంక్రమణంగా భక్తులు ఆరాధిస్తుంటారు. అన్నింటిలోనూ అత్యంత శుభగ్రహంగా గురు గ్రహాన్ని పూజిస్తారు. గురు గ్రహ అధిపతి దక్షిణామూర్తి మేష రాశి నుంచి వృషభరాశిలోకి మారనున్నారు. ఈ సంక్రమణం సమయంలో విశేష పూజలు చేస్తుంటారు. ఇందులో భాగంగా ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి గురువారం సంక్రాంతి పూజలు జరగనున్నాయి. ఇందుకోసం శాస్త్రవేత్తంగా బుధవారం రాత్రి గురుదక్షిణామూర్తి సన్నిధిలో అంకురార్పణ చేశారు. కలశ స్థాపనతో, గణపతి పూజ, వాస్తు పూజతో ఆరాధించారు. గురువారం ఉదయం సహస్ర శంఖాభిషేకం (1008) వివిధ ప్రత్యేక పూజా ద్రవ్యాలతో అభిషేకాలు జరగనున్నాయి. కాగా ముక్కంటి ఆలయం సమీపం తేరు వీధిలో ఉన్న పుష్పగిరి మఠంలో బుధవారం గురుదక్షిణామూర్తికి గురు సంక్రమణం పూజలు నిర్వహించారు. ఇందలో భాగంగా ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

ద్విచక్ర వాహనం దగ్ధం

శ్రీకాళహస్తి, మే 1: శ్రీకాళహస్తి పట్టణ శివారు టైలర్స్ కాలనీలో బుధవారం వేకువ జామున రూ3.20 లక్షల ఖరీదైన ద్విచక్ర వాహనం దగ్ధమైంది. టైలర్స్ కాలనీ ప్రాంతానికి చెందిన చందు ఓ పొగాకు ఉత్పత్తుల కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తుంటాడు. ఇటీవల హిమాలయ రాయల్ ఎన్ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశారు. మంగళవారం రాత్రి ఇంటి ముందు నిలిపి నిద్రించారు. వేకువజామున మంటలు ఎగసిపడుతుండడంతో వెలుపలకు వచ్చి చూశారు. మంటలు అదుపు చేసి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కాల్చారా, ప్రమాదవశాత్తు సంభవించిందా అన్న కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు.

మోడల్ పోలింగ్ బూత్ పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, మే 1: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ బూత్‌ను తహసీల్దారు పఠాన్ మహ్మద్ అలీఖాన్, డీటీ శాంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటు ఎలా వేయించాలో అధికారులకు తెలియజేయడానికి పాఠశాలలో మోడల్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

సూపర్ సిక్స్‌తో మంచి భవిష్యత్: సుధీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, మే 1: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉంటుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలంలోని సాంబయ్యపాళెం, తంగేల్లపాళెం, శివనాథపురం, తొట్టంబేడు, రౌతుసూరమాల గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, మట్టి, మాఫియా అక్రమాలు, దౌర్జన్యాలు తప్ప నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదన్నారు. వైసీపీని ఇంటికి పంపడానికి రాష్ట్రంలో ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల అధ్యక్షుడు మురళీ నాయుడు, మునిరాజ నాయుడు, జయచంద్రనాయుడు, ఎస్సీవీ దిలీప్, అమర్నాథ్, కొట్టిసాయి, ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శోభన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని మడిబాక పంచాయతీ రాజులకండ్రిగ, మడిబాక గ్రామాల్లో బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

రేణిగుంట: రైల్వే గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణంతో నష్టపోయిన బాధితులకు న్యాయం చేస్తామని బొజ్జల రిషితారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని బుగ్గవీధి, జీఎంవీధిలో ఇంటింటికీ మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా

శ్రీకాళహస్తి: కార్మికులందరికీ అండగా ఉంటానని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.


మేడే వేడుకల్లో బొజ్జల సుధీర్ రెడ్డి

ఎన్డీఏతోనే సామాజిక న్యాయం

తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు


వరప్రసాదరావును శాలువాలతో సత్కరిస్తున్న ఎన్డీఏ నాయకులు

తిరుపతి (ఉపాధ్యాయనగర్), వెంకటగిరి, గూడూరు, మే 1: ఎన్డీఏతోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు సతీమణి కొల్లూరి లక్ష్మి అన్నారు. తిరుపతి బృందావనం అపార్ట్‌మెంట్‌లో ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ తన భర్త ఎంపీగా ఉన్న సమయంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేవారని, తిరుపతి అభివృద్ధి ఆయనతోనే జరిగిందన్నారు.

కూటమి మేనిఫెస్టో పేదల కోసమే...

టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టో పేదలను ఆదుకునే విధంగా ఉందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఎన్డీఏ కూటమి నాయకులతో సమావేశమై మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, రూ.4వేల పింఛన్ అందిస్తారని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను ప్రజలకు వివ రించాలన్నారు. ఈ సందర్భంగా వరప్రసాదరావును కూటమి సత్కరించారు.

ఎన్డీఏ నాయకులతో సమావేశం

గూడూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎన్డీఏ కూటమి నాయకులతో వెలగపల్లి వరప్రసాదరావు సమావేశమయ్యారు. ప్రచార తీరును సమీక్షించారు. చిల్లకూరు మండల జడ్పీటీసీ సభ్యుడు మన్నెం శ్రీనివాసులు, వరగలి ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, తిప్పనూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, వంకా రమణయ్య, శివ, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


తిరుపతిలో ప్రచారం నిర్వహిస్తున్న వరప్రసాదరావు సతీమణి లక్ష్మి

కమనీయం ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం



బుచ్చినాయుడుకండ్రిగ, మే 1: మండల కేంద్రంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షికోత్సవాన్ని పురస్కరించుకని స్థానిక పద్మావతి సేవా మందిరంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి విగ్రహానికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవికి కల్యాణోత్సవాన్ని కమనీయంగా వేదపండితులు జరిపించారు. భక్తిశ్రద్ధలతో భక్తులు స్వామి అమ్మవార్ల వివాహ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరగించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

వరదయ్యపాళెం, మే 1: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సత్యవేడు నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం అన్నారు. వరదయ్యపాళెం మండలంలోని తొండూరు, మత్తెరిమిట్ట, బత్తలవల్లం, నెలటూరు, గుడాలవారిపల్లె, కదూరు,మోపూరుపల్లి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

టీడీపీలో చేరికలు

ఏర్పేడు, మే 1: ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారిరి బొజ్జల రిషితారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గోపాల్, సాయి, వినయ్, ప్రసాద్, డిల్లీబాబు తదితరులు ఉన్నారు.

కాపుల ఐక్యతను చాటుకుందాం: పల్లమాల సుధాకర్


చదలవాడ కృష్ణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న సుధాకర్ - బలిజ ఆత్మీయ సమావేశానికి కోలా ఆనంద్‌కు ఆహ్వానం

శ్రీకాళహస్తి, మే 1: కాపుల ఐక్యతను చాటుకుందామని మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకుడు పల్లమాల సుధాకర్ పిలుపునిచ్చారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని బుధవారం పలువురు ముఖ్యులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ అఖండ మెజారిటీతో గెలిపించుకునే అంశాలపై చర్చించారు. ఆదివారం పట్టణంలో తాను నిర్వహించే బోయే బలిజ ఆత్మీయ సమావేశం జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తిరుపతి మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ గెలుపు కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నేత నాగయ్య మృతి

పిచ్చాటూరు, మే 1: పిచ్చాటూరు మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు నాగయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన కీళపూడిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీపీ మధుబాల, టీడీపీ నాయకులు సతీష్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు, పద్మనాభరాజు, తిరుమలరెడ్డి, ఇళంగోవన్ రెడ్డి, రామకృష్ణంరాజు తదితరులు నాగయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

కూటమి అభ్యర్థులను ఆదరించండి

వరదయ్యపాళెం, మే 1: తర్వలో జరగనున్న ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమి అభ్యర్థులను ఆదరించాలని బీజేపీ మోర్చా జిల్లా కార్యదర్శి దిలీప్ రాయల్ కోరారు. బుధవారం వరదయ్యపాళెంలోని ఇందిరానగర్, పద్మావతిపురం, గోవర్ధనపురం, లక్ష్మీపురం కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.

ఒకే మార్గంలో కూటమి, వైసీపీ ప్రచారం

రేణిగుంట, మే 1: ఎన్నికల ప్రచారంలో ఎన్‌డీఏ కూటమి, వైసీపీ ఎదురుపడటంతో పోలీసులు వైసీపీ ప్రచారాన్ని కొంతసేపు ఆపేశారు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం రేణిగుంటలో చోటు చేసుకుంది. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి పోస్టాఫీసు వీధినుంచి అన్నదాన సత్రం వీధిలో వెళ్లేందుకు ప్రచారం నిర్వహిస్తుండగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి ప్రచారంతో ఎదురుపడ్డారు. దీంతో పోలీసులు వైసీపీ ప్రచారాన్ని కొంతసేపు ఆపేశారు. కూటమి నేతలు అన్నదానసత్రం వీధిలోకి వెళ్లాక వైసీపీ నేతలను పంపారు.

మార్పు కోసం యువత ముందుకొస్తోంది


దగ్గుమళ్ల ప్రసాదరావును సన్మానిస్తున్న నాయకులు

నగరి మే 1: రాష్ట్రంలో అధికార మార్పుకోసం యువత ముందుకు దూసుకొస్తోందని చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, నగరి అభ్యర్థి భానుప్రకాష్ అన్నారు. నగరి పట్టణ పరిధిలోని టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం నియోజకవర్గంలోని యువకులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో యువత నిర్వీర్యమైందన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నమ్మపలికిన జగన్‌రెడ్డి యువతను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల వ్యాపారం పెంచారే గాని యువతకు ఉపాధినిచ్చే పరిశ్రమలను తేవడంలో విఫలమయ్యారన్నారు. నగరి ఎమ్మెల్యే రోజా ఆస్తులను పెంచుకోవడంలో చూపిన చొరవ నియోజకవర్గ అభివృద్ధిలో చూపలేదని విమర్శించారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమితోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. యువత తలచుకుంటే సాధ్యం కానిది ఏమీ లేదని, ప్రభుత్వ మార్పిడి దిశగా అడుగులు వేయాలని కోరారు. యువతకు భవిత కావాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి రాష్ట్రాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. తమకు చంద్రబబాబు హయాంలోనే న్యాయం జరిగిందని, జగన్ వచ్చాక ఉన్న పరిశ్రమలు కూడా ఖాళీ అయ్యాయని సాఫ్ట్‌వేర్ రంగంలోని యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

పుత్తూరు వార్తలు

ఉమ్మడి మ్యానిపెస్టోతో అన్ని వర్గాలకు మేలు

నారాయణవనం, మే 1: ఎన్డీఏ ప్రకటించిన మేనిపెస్టో అన్ని వర్గాల వారికి మేలు జరిగేలా ఉందని, ఖచ్చితంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థులందరూ అఖండ మెజారిటీతో ప్రజలు ఆశీర్వదించానున్నారని నారాయణవనం జడ్పీటీసీ సుమన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన సత్యవేడు నియోజకవర్గ అసెంబ్లీ నమూనా బ్యాలెట్‌ను స్థానిక నాయకులకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచకపాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, వైసీపీని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సైకిల్ గుర్తు బటన్ నొక్కి ఆదిమూలంను అఖండా మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వైసీపీకి ఓటు వేస్తే మీ ఆస్తులు మీకు దక్కవు: భానుప్రకాష్


ప్రచారంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మే 1: వైసీపీకి ఓటు వేస్తే మీ ఆస్తులు మీకు దక్కవని ఎన్‌డీఏ కూటమి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ, కనకంపాళెం, గొల్లకండ్రిగ, పరమేశ్వరమంగళం, వేపగుంట, కైలాసపురం, కృష్ణసముద్రం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చిన జగన్ భూ వివాదాల అంశాన్ని న్యాయస్థానం పరిధి నుంచి తప్పించి అధికారులకు కట్టబెట్టే ప్రమాదకర ఆటకు శ్రీకారం చుట్టారని ధ్వజమెత్తారు. దీని వల్ల భూ వివాదాలను ఆసరగా చేసుకుని ప్రజల జీవితాలతో చెలగాటమాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా, మంత్రిగా నియోజకవర్గానికి ఏమి వెలగబెట్టారని ప్రజలను రోజా ఓట్లు అడుగుతోందని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో ఒక్క రోజా కుటుంబం మాత్రమే బాగుపడిందని తేల్చి చెప్పారు. మరోసారి వైసీపీ మాయమాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సమాజంలోని ప్రతి వర్గం ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనే బృహత్తర లక్ష్యంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకులు మేనిఫెస్టోను రూపొందించారని వివరించారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, చిత్తూరు ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాద్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంజి మాధవయ్య, డీఎస్ ఏలుమలై మొదలియార్, రవికుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టణ పరిధిలోని ఒకటవ వార్డులో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు సంతోష్, సుబ్రమణ్యం, మణిరెడ్డి, గోపాల్, చిరంజీవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




అభివృద్ధి అంటే ఇదేనా?


8,9డివిజన్లు ఇలా ఉన్నాయి



తిరుపతి(కొర్లగుంట), మే 1: ఎన్నికలు కదా.. ఎర్రటి ఎండలైనా నాయకులు వీధి వీధికీ వస్తున్నారు. చెమటలు కారుతున్నా ఇల్లిల్లూ తిరుగుతున్నారు. తిరుపతి నగరాన్ని సుందర నందనవనంలా మార్చేశామని చెబుతున్నారు. అభివృద్ధిని చూసి ఓటేయండి అని అడుగుతున్న నాయకులకు నగరం ఎంత గబ్బు పట్టిపోతోందో ఫొటోలు పట్టి చూపుతోంది ఆంధ్రజ్యోతి. ఇవి 8, 9 డివిజన్‌లలోని జన సమస్యలు. సంజయ్ గాంధీకాలనీ, సుభాష్‌నగర్, కొర్లగుంట, ఎర్రమిట్ట, కరకంబాడిరోడ్డులలో బుధవారం నాటి దృశ్యాలు ఇవి. డ్రైనేజీ మరమ్మతుల కోసం తవ్వేసి వదిలేసిన వీధులు, పూడిపోయిన సైడ్‌కాలువలు, కాలువల్లో తేలాడే ప్లాస్టిక్ బాటిళ్లు, నిండిన కాలువల తూములు, వీధుల్లో దిబ్బలు దిబ్బలుగా వ్యర్థాలు, పొంగుతున్న డ్రైనేజీ, పనిచేయని చేతిబోర్లు, దుర్వాసన వెదజల్లుతూ నివాసాల మధ్యలో ప్రవహిస్తున్న కాలువలు.. ఎన్నికల రోజుల్లోనే ఇలా ఉంటే గెలిచాక అసలు పట్టించుకుంటారా? ప్రతిరోజూ మీ ముంగిటకి వస్తున్న నాయకులకి ఈ సమస్యలు చూపించి.. నిలదీస్తే తప్ప ఇవి పరిష్కారం కావు.

గంగమ్మ జోలికొచ్చారు.. శాస్తి జరుగుతుంది

- తిరుపతి సంప్రదాయాలు చెరిపేశారు
- సొంత సారెలతో ఆర్భాటం చేశారు
- కార్పొరేటర్లు అసహనంతో ఉన్నారు
- టీడీపీ నాయకుడు ఆర్సీ మునికృష్ణ



నుదుటిన బొట్టు.. పసుపు పచ్చని దుస్తులు.. తిరుపతి కార్పొరేషన్‌లో వినిపించే ఒకేఒక్క విపక్ష స్వరం ఆర్సీ మునికృష్ణ. తెలుగుదేశం పార్టీకి వీర విధేయ భక్తుడు. అధికారపార్టీ అరాచకాలపై నగరంలో నిరంతరం నిరసన తెలుపుతుంటారు. గతంలో గంగమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్‌గా చేసిన ఈయన ప్రస్తుతం కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వర్తమాన రాజకీయాలపై ఆర్సీ మునికృష్ణతో ఫటాఫట్ ఇంటర్వ్యూ..

? మీరు అధికారంలోకి వస్తే కౌన్సిల్లో మీ బలం పెరుగుతుందా.

! కార్పొరేషన్ కౌన్సిల్ ఏర్పాటై మూడేళ్లు పూర్తయింది. 48 మంది వైసీపీ కార్పొరేటర్లు, 5 మంది కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. వారిలో నేనొక్కడినే టీడీపీ కార్పొరేటర్‌గా గెలిచా. ఇటీవల ఇద్దరు వైసీపీ మహిళా కార్పొరేటర్లు మా పార్టీలో చేరారు. ఈసంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి.

? వైసీపీ కార్పొరేటర్లకు కోటి రూపాయలిచ్చి కండువా కప్పుతున్నారని భూమన కరుణాకరరెడ్డి ఆరోపిస్తున్నారు.

! ఆ అవసరం మాకు లేదు. భూమన కబంధ హస్తాల నుంచి బయటపడితే చాలని చాలామంది కార్పొరేటర్లు ఎదురు చూస్తున్నారు. తిరుపతి టీడీపీకి టికెట్ వచ్చివుంటే ఈపాటికే వారి దుకాణం బంద్ అయ్యేది.మామిత్ర పక్షమైన జనసేనకు రావడంతో కొంత ఆలస్యమవుతోంది అంతే. కార్పొరేషన్‌లో వైసీపీ సీట్లు ఖాళీ అయ్యేది మాత్రం పక్కా.

? కార్పొరేటర్ల అవినీతి మీద ప్రచారం జరుగుతోంది.

! కేవలం ఓ పది మంది కార్పొరేటర్లే సంపాదనలో మునిగి తేలుతున్నారు. వారు కూడా రోజువారీ కలెక్షన్ పద్మావతిపురం బంగ్లాకు పంపాల్సిందే. తక్కిన కార్పొరేటర్లకు గౌరవవేతనం రూ.6వేలు తప్ప కనీస గౌరవ మర్యాదలు కూడా లేవు. డిప్యూటీ మేయర్‌గా ఉన్న వైసీసీ ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ పాత్రలేనిదే కార్పొరేషన్‌లో చిన్న కుర్చీకూడా కదలదు. అందుకే అందరూ అసహనంతో రగిలిపోతున్నారు.

? గంగజాతరలో సంప్రదాయాలను గాలికొదిలేశారన్న విమర్శల మీద మీ స్పందన.

! నేను గంగమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్‌గా ఉన్నపుడు రూ.15లక్షలతోనే ఘనంగా గంగ జాతరను చేసేవాళ్లం. కరుణాకర రెడ్డి రూ.2కోట్లు వసూళ్లు చేసి గంగజాతర కాకుండా వైసీపీ జాతర చేశారు. శ్రీవారి సారె ఊరేగింపు సంప్రదాయాన్ని తుంగలో తొక్కారు. ఆలయ ఛైర్మన్ హోదాలో పురవీధుల్లో సారెను తీసుకొస్తుంటే వేలాదిమంది భక్తులు పసుపు నీళ్లుపోసి హారతులిచ్చి పూజలు చేస్తారు. భూమన సొంత సారెల హంగూ ఆర్భాటాలే కనిపిస్తున్నాయి. అనుచరగణంతో ఆయన గుడిలో తిష్ఠవేసి సాధారణ భక్తులకు దర్శనంలేకుండా చేశారు. చెంపనరికే ఘట్టాన్ని కూడా మూడు గంటల ముందే పూర్తిచేశారు. గుడి, ప్రహరీ నిర్మాణంపై శ్వేతపత్రం విడుదలచేయాలి. ఆ నిధులు గోల్ అయ్యాయని దేవదాయశాఖ అధికారులే అంగీకరించారు. మహిమగల అమ్మవారి జోలికొచ్చారు. త్వరలోనే గుణపాఠం తెలుసుకుంటారు.

? గంగమ్మకు కొత్తగుడిపై మీ అభ్యంతరం ఏమిటి.

ఫటాఫట్ !

! తాతయ్యగుంట గంగమ్మ గుడికి వేల ఏళ్ల చరిత్ర ఉందని ఎమ్మెల్యేనే చెప్పారు. అలాంటి ఆలయాన్ని ఏకపక్ష నిర్ణయంతో పూర్తిగా నేలమట్టం చేశారు. చివరకు అమ్మవారి మూల విరాట్‌ను తీసి మూటకట్టి గదిలో పెట్టేశారు. గుడిని కొట్టమని ఎవరు చెప్పారు? విగ్రహాన్ని ఎందుకు తీశారు? గంగమ్మ భక్తులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కేవలం భూమనకు భయపడి మాత్రమే ఎవ్వరూ నోరు తెరవలేదు. ఎన్నికల్లో ఆ ఫలితం కనిపిస్తుంది చూడండి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మార్పు కోసం యువత ముందుకొస్తోంది

చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు

నగరి మే 1 : రాష్ట్రంలో అధికార మార్పుకోసం యువత ముందుకు దూసుకొస్తోందని చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, నగరి అభ్యర్థి భానుప్రకాష్ అన్నారు. నగరి పట్టణ పరిధిలోని టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం నియోజకవర్గంలోని యువకులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో యువత నిర్వీర్యమైందన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నమ్మపలికిన జగన్‌రెడ్డి యువతను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల వ్యాపారం పెంచారే గాని యువతకు ఉపాధినిచ్చే పరిశ్రమలను తేవడంలో విఫలమయ్యారన్నారు. నగరి ఎమ్మెల్యే రోజా ఆస్తులను పెంచుకోవడంలో చూపిన చొరవ నియోజకవర్గ అభివృద్ధిలో చూపలేదని విమర్శించారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమితోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. యువత తలచుకుంటే సాధ్యంకానిది ఏమీ లేదని, ప్రభుత్వ మార్పిడి దిశగా అడుగులు వేయాలని కోరారు. యువతకు భవిత కావాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి రాష్ట్రాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. తమకు చంద్రబబాబు హయాంలోనే న్యాయం జరిగిందని, జగన్ వచ్చాక ఉన్న పరిశ్రమలు కూడా ఖాళీ అయ్యాయని సాఫ్ట్‌వేర్ రంగంలోని యువకులు తెలిపారు. నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



దగ్గుమళ్ల ప్రసాదరావును సన్మానిస్తున్న టీడీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

వేద, ఆధునిక శాస్త్రాలు కలవాలి



సమ్మేళనంలో పాల్గొన్న టీటీడీ ఈవో, సంస్కృత విశ్వవిద్యాలయాల వీసీలు

తిరుమల, మే1 (ఆంధ్రజ్యోతి): వేద, ఆధునిక శాస్త్రాలు కలిస్తేనే ఒక కొత్త శాస్త్ర సాంకేతికత ఉద్భవిస్తుందని న్యూఢిల్లీలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ శ్రీనివాస వరఖేడి అభిప్రాయపడ్డారు. శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, భారతీయ విజ్ఞాన వ్యవస్థల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో బుధవారం విశ్వ వైదిక విజ్ఞాన సమ్మేళనం ప్రారంభమైంది. సంస్కృత పండితులు చంద్రశేఖర సరస్వతి, బ్రహ్మశ్రీ కుటుంబ శాస్త్రి మాట్లాడుతూ.. విశ్వంలో అగ్ని ద్వారానే సమస్తమైన కర్మలు నిర్వర్తించబడుతున్నాయని, దీనికి అనుగుణంగా వేద విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరగాలన్నారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. వేదంలో దాగి ఉన్న వైజ్ఞానిక అంశాలను ప్రపంచానికి అందిస్తామన్నారు. న్యూఢిల్లీకి చెందిన ఐకేఎస్ డివిజన్ జాతీయ కో ఆర్డినేటర్ జీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. వేద విజ్ఞానాన్ని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఇంప్లిమెంట్ చేయాలన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వేద విజ్ఞాన కేంద్రంగా ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పెంపొందాలని ఉద్ఘాటించారు. వేద, ఆధునిక శాస్త్రాలను ఏకతాటిపై తీసుకురావడమే టీటీడీ ప్రధాన లక్ష్యమన్నారు. అధ్యక్షత వహించిన ఎస్వీవివియూ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ.. మన వైదిక ధర్మంలో దాగి ఉన్న విజ్ఞాన బీజాలను అన్వేషించడమే లక్ష్యంగా నాలుగురోజుల సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఆధునిక విజ్ఞానం-వేద విజ్ఞానం సదస్సులో అమెరికా, ఆస్ట్రేలియా, నేపాల్ వంటి దేశాల నిపుణులతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు కూడా పాల్గొంటారన్నారు. 26 సాంకేతిక సెషన్లలో సుమారు 90 మంది వక్తలు వేదాలతో భూమి, అంతరిక్ష శాస్త్రాలు, అథర్వ వేద వనస్పతి విజ్ఞానం, వేద సృష్టి, సామవేద అగ్ని విజ్ఞానం, ఆయుర్వేదం వంటి ఆసక్తికరమైన అంశాలపై పత్రాలు, ప్రసంగాలు సమర్పించనున్నారన్నారు. భవిష్యత్ తరాల కోసం ఈసదస్సు 'నాలెడ్జ్ బ్యాంక్'గా ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి, డీన్‌లు వెంకట సుబ్రహ్మణ్య శర్మ, ఫణి యజ్ఞేశ్వరయాజులు, కార్యక్రమ కోఆర్డినేటర్ తారకరామ శర్మ, ఇతర పండితులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గురు సంక్రమణ పూజలకు అంకురార్పణ


శ్రీకాళహస్తి, మే 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురు సంక్రమణ పూజల కోసం బుధవారం అంకురార్పణ చేశారు. నవగ్రహాలలో పంచముడైన గురుగ్రహం రాశి మారే సమయాన్ని సంక్రమణంగా భక్తులు ఆరాధిస్తుంటారు. అన్నింటిలోనూ అత్యంత శుభగ్రహంగా గురు గ్రహాన్ని పూజిస్తారు. గురు గ్రహ అధిపతి దక్షిణామూర్తి మేష రాశి నుంచి వృషభరాశిలోకి మారనున్నారు. ఈ సంక్రమణం సమయంలో విశేష పూజలు చేస్తుంటారు. ఇందులో భాగంగా ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి గురువారం సంక్రాంతి పూజలు జరగనున్నాయి. ఇందుకోసం శాస్త్రవేత్తంగా బుధవారం రాత్రి గురుదక్షిణామూర్తి సన్నిధిలో అంకురార్పణ చేశారు. కలశ స్థాపనతో, గణపతి పూజ, వాస్తు పూజతో ఆరాధించారు. గురువారం ఉదయం సహస్ర శంఖాభిషేకం (1008) వివిధ ప్రత్యేక పూజా ద్రవ్యాలతో అభిషేకాలు జరగనున్నాయి. కాగా ముక్కంటి ఆలయం సమీపం తేరు వీధిలో ఉన్న పుష్పగిరి మఠంలో బుధవారం గురుదక్షిణామూర్తికి గురు సంక్రమణం పూజలు నిర్వహించారు. ఇందలో భాగంగా ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



గురుదక్షిణామూర్తి సన్నిధిలో కలశ స్థాపన పూజలు

మూడు నెలలు బ్రేక్

- ఆగస్టు 4 వరకూ శుభకార్యాలకు అడ్డంకి
- గురు, శుక్ర మూఢమి, ఆషాఢ మాసాలే కారణం
- రాజకీయ నాయకులకు కాస్త వెసులుబాటు



కలికిరి, మే 1: ఊపిరి సలపకుండా ఏప్రిల్ నెలలో కళకళలాడిన కల్యాణ మండపాలకు ఇక నుంచి మరో మూడు నెలలు విరామం ఏర్పడింది. రానున్న ఆగస్టు 4 తర్వాతే తిరిగి శుభ ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి. తెలుగులో చెప్పాలంటే వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ మాసాల్లో వివాహాలు, శంకుస్థాపనలు, విగ్రహ ప్రతిష్ఠలు, గృహ ప్రవేశాల వంటి విశిష్ట కార్యక్రమాలకు మంచి రోజులు లేవని పండితులు చెబుతున్నారు. సూర్యకాంతి గురు గ్రహంపై పడినప్పుడు గురు మౌఢ్యమి, శుక్రగ్రహంపై పడినప్పుడు శుక్ర మౌఢ్యమి సంక్రమిస్తుందని దీంతో ఆయా గ్రహాల ఆగమన గమనాలను లెక్కించడానికి సాధ్యం కానందువల్ల శుభ ముహూర్తాలను నిర్ధారించలేమని వీరంటున్నారు. సాధారణంగా వేసవి కాలంలో పెళ్లిళ్లతో సహా వివిధ శుభ కార్యాలు నిరాటంకంగా జరిగేవి. పురోహితులు చెబుతున్న దాని ప్రకారం ఏప్రిల్ 28న చైత్ర బహుళ చవితి నుంచి జూలై 8వ తేదీ సోమవారం వరకు ఆషాఢ శుద్ధ తదియ శుక్ర మౌఢ్యమి ఉంటుంది. అదే విధంగా మే 7వ తేదీ మంగళవారం చైత్ర బహుళ చతుర్దశి నుంచి జూన్ 7వ తేదీ గురువారం వరకూ జ్యేష్ఠ శుక్ల పాడ్యమి కొనసాగుతుంది. ఆ తరువాత యథాప్రకారం జూలై 6 నుంచి ఆగస్టు 4 వరకూ ఆషాఢ మాసం రావడంతో వరుసగా నాలుగు నెలల పాటు శుభ కార్యాలకు పూర్తి విరామం లభించినట్లయ్యింది. మూఢాలు, ఆషాఢాల కారణంగా ముహూర్తాలు కొరవడటంతో శుభ కార్యాలపై ఆధారపడిన పురోహితులు, భజంత్రీలు, పూల వ్యాపారాలు, వస్త్ర, స్వర్ణాభరణాల దుకాణాల వ్యవహారాలు మందగించనున్నాయని అంటున్నారు. ఇక కల్యాణ మండపాల సంగతి సరేసరి. కాగా ఎన్నికల వాతావరణంలో ఏప్రిల్ నెలలో రాజకీయ నాయకులు ఊపిరి సలపకుండా రోజుకు ఐదారు పెళ్లిళ్లకు హాజరయ్యారు. వాళ్ల హడావిడి కారణంగా తెల్లవారు జామున పెళ్లిళ్లకు కూడా వరసపెట్టి పాల్గొన్నారు. ఇక మే, జూన్ నెలలు కూడా రాజకీయంగా సందోహంగానే ఉంటుంది. ఆపై ఆగస్టు 4వ తేదీ తరువాత మళ్లీ శుభ ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి.



ముఖేశ్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న బీసీవై పార్టీ నేతలు

పెద్దిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలి

సదుం ఘటనలో నిందితులను అరెస్టు చేయాలి - ఈసీకి బీసీవైపీ విజ్ఞప్తి

పుంగనూరు, మే 1: సదుంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌పై దాడి చేసి విధ్వంసానికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని ఆ పార్టీ నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో ముఖేశ్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. బుధవారం విజయవాడ ఎన్నికల కమిషన్ కార్యాలయంలో బీసీవై పార్టీ మంగళగిరి ఇన్‌చార్జి శివరాం, రాష్ట్ర నాయకురాలు చాముండేశ్వరిదేవి తదితరులు సీఈవోను కలిసి పుంగనూరు నియోజకవర్గం సదుంలో వైసీపీ అల్లరి మూకలు చేసిన దాడి, బీభత్సం గురించి వివరించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, ప్రధానంగా పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న వైప్లస్ భద్రత గల రామచంద్రయాదవ్‌కు పోలీసు భద్రత కల్పించకుండా వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడైన రామచంద్రయాదవ్‌పైనే హత్యాయత్నం కేసు పెట్టి, ఎన్నికలకు దూరం చేయాలని పోలీసులు కుట్ర చేశారని, పోలీస్‌స్టేషన్‌పై వైసీపీ వారు దాడి చేసి స్టేషన్ ముందే ప్రచారరథం కాల్చివేశారని వివరించారు. న్యాయం కోసం అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళతామని నాయకులు తెలిపారు.

సదుం ఘటనలో 9 మందికి రిమాండ్

తిరుపతి(నేరవిభాగం), మే 1: సదుం మండలం ఎర్రాతివారి పల్లెలో సోమవారం జరిగిన ఘర్షణలో మండల పరిధిలోని వేదాయపాలెం, గుట్టపల్లి, యాదమరి, దాసర్లపల్లి, రాజుపల్లి ప్రాంతాలకు చెందిన అనిల్‌కుమార్ రెడ్డి, వెంకటేష్, ఓం ప్రకాష్, వేణుగోపాల్ రెడ్డి, విశ్వనాథం, కృష్ణదుర్గ, వెంకటాచలపతి, సుబ్రహ్మణ్యం, నవీన్‌కుమార్‌లపై ఐపీసీ 307, 147,148,341,323 సెక్షన్ల కింద చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ మారుతీలు వీరిని తిరుపతిలోని ఒకటో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి సత్య క్రాంతకుమార్ ఎదుట బుధవారం రాత్రి హాజరు పరిచారు. వీరికి ఈనెల 14వ తేదీవరకు రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పినట్లు సీఐ కృష్ణారెడ్డి చెప్పారు. వారిని చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు.

న్యాయం కోసం వెళితే చితకబాదారు

- భర్త దాడిలో గాయపడిన భార్య, అత్త



న్యాయం కోసం వెళ్లిన అత్తను కొడుతున్న అల్లుడు - కోడలు స్వప్న జుట్టు పట్టుకుని చితకబాదుతున్న అత్తామామ

మదనపల్లె టౌన్, మే 1: భార్యాభర్తల వివాహబంధం విషయమై కోర్టులో కేసు జరుగుతుండగా, భర్త రెండో వివాహం చేసుకున్నాడని అతడి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న భార్య, అత్తపై ఆమె భర్త, మామ కలిసి దాడి చేశారు. వివరాల్లోకి వెళితే... పుంగనూరుకు చెందిన శకుంతలమ్మ కుమార్తె టి.స్వప్న (28)ను ఏడేళ్ల క్రితం వాల్మీకిపురం మండలం భూమకవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు ఎం.నరసింహులు(34)కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి బాలకృష్ణ అనే కుమారుడు ఉన్నాడు. రెండేళ్ల క్రితం వీరిద్దరి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి మదనపల్లె కోర్టులో కేసులు వేసుకున్నారు. తీర్పు రాక ముందే నరసింహులు రెండో వివాహం చేసుకుని ఇంకో కొడుకును కన్నాడని స్వప్న తెలుసుకుంది. ఈ విషయమై పలుమార్లు భర్త ఇంటికి వెళ్లి నిలదీసింది. ఈ క్రమంలో బుధవారం స్వప్న, ఆమె తల్లి శకుంతలమ్మ దేవతానగర్‌లోని నరసింహులు ఇంటి వద్దకు వెళ్లి నిరసనకు దిగారు. దీంతో రెడ్డెప్ప, ఆయన కుమారుడు నరసింహులు అక్కడికి చేరుకుని వారిద్దరినీ చితకబాదారు. స్థానికులు ఈ ఘటనను వీడియో తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. గాయపడి మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శకుంతలమ్మను విచారించి, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జీతాలు పడ్డాయి

- పెన్షన్లు కూడా...
- రెండేళ్ల క్రితం ఇవ్వాల్సిన డీఏతో సహా చెల్లింపు
- బ్యాంకులకు సెలవైనా ఖాతాల్లో జమ

కలికిరి, మే 1: వైసీపీ ప్రభుత్వంలో మొదటిసారి ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు జమయ్యాయి. మే డే సందర్భంగా బుధవారం బ్యాంకులకు సెలవు రోజయినా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతాలు మాత్రం ఖాతాల్లో పడ్డాయి. అదే విధంగా విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు కూడా వారి ఖాతాల్లో జమ చేశారు. ఎప్పుడూ వారం, పదిహేను రోజుల్లోగా జీతాలు చూసి ఎరుగని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీరా పోలింగ్‌కు పది రోజుల ముందు సరిగ్గా నెల మొదటి రోజునే జరిగిన ఈ చెల్లింపులను చూసి ఇది కొత్త రకం ఎత్తుగడగా చెప్పుకుంటున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షన్‌దార్లలో పెల్లుబుకుతున్న ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రతను తగ్గించడానికి ఎవరూ డిమాండు చేయకుండానే ఒకటవ తేదీ వేతనాలు జమ చేయడంపై సర్వత్రా చర్చించుకుంటున్నారు. అయితే 16 నెలల డీఏ బకాయిల ఊసు మాత్రం లేదు గానీ ఒక నెల డీఏ 3.64 శాతం జీతాల్లో కలపడం కొసమెరుపుగా చెబుతున్నారు. ఒకటో తేదీన జీతాలు జమ కావడం సంతోషం కాదా అని కొంతమందిని విచారించగా ఫస్టు ఇదే లాస్టు ఇదేనన్న రీతిలో నిర్వేదంగా సమాధానాలు వస్తున్నాయి.



బద్వేలులో యానిమేటర్ల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దాసరి సుధ

మెప్మా యానిమేటర్లతో వైసీపీ సమావేశం

» అడ్డుకున్న కూటమి నాయకులు.. వాగ్వాదం

బద్వేలు, మే 1: సార్వత్రిక ఎన్నికలలో గెలిచేందుకు వైసీపీ అడ్డదారులు తొక్కుతోంది. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులో బుధవారం వైసీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కళాశాలలో మెప్మా యానిమేటర్లతో వైసీపీ నాయకులు రహస్య సమావేశం నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి సుధ, కుడా చైర్మన్ గురుమోహన్, బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులందరూ వైసీపీకి ఓట్లు వేసేలా కృషిచేయాలని, తిరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని విధాలా లబ్ధి చేకూరుస్తామని, ప్రస్తుతానికి నగదు లేదా వస్తు రూపంలో బహుమతులు అందజేస్తామని వైసీపీ నాయకులు చెప్పినట్టు తెలిసింది. ఈ సమావేశం విషయం తెలుసుకున్న టీడీపీ, బీజేపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. దీంతో కూటమి, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో యానిమేటర్లు ముఖాలకు ముసుగులు వేసుకుని పారిపోయారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారికి సర్ది చెప్పారు.

మంత్రి సీదిరి గ్రామంలో టీడీపీ ప్రచారం

» అడ్డుకున్న వైసీపీ...పరిస్థితి ఉద్రిక్తం

వజ్రపుకొత్తూరు, మే 1: మంత్రి సీదిరి అప్పలరాజు స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలో బుధవారం టీడీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. టీడీపీ ఎంపీ అభ్యర్థి కె.రామ్మోహన్, పలాస అసెంబ్లీ అభ్యర్థి గౌతు శిరీషా బుధవారం రాత్రి దేవునల్తాడలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. వీరి ప్రచార రథం బస్టాండ్ వద్దకు వచ్చేసరికి స్థానిక వైసీపీ కార్యకర్తలు అడ్డుకునే యత్నం చేశారు. దీనిపై రామ్మోహన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి వచ్చామని, గొడవలు చేయడానికి రాలేదని అన్నారు. అయినా వైసీపీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో టీడీపీ, జనసేన కార్యకర్తలు వారిని నిలదీశారు. గ్రామపెద్దలు ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

బొత్స సందీప్ ఫోర్జరీ కేసు వివరాలివ్వండి

» తెలంగాణ పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ కొడుకు బొత్స సందీప్‌పై ఉన్న ఫోర్జరీ కేసు వివరాలను సమర్పించాలని తెలంగాణ హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 422లోని 31 ఎకరాల భూములను కబ్జా చేసే ఉద్దేశంతో తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను ఫోర్జరీ చేశారని పేర్కొంటూ బొత్స సందీప్ సహా పలువురిపై ఫిర్యాదు నమోదైంది. ఈ కేసులో పోలీసులు బొత్స సందీప్ సహా ఇతరులపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని పేర్కొంటూ షాబాద్ మండలం పెదవేడు గ్రామానికి చెందిన బొప్పి మహేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది రోహిత్ పోగుల వాదనలు వినిపిస్తూ- కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న భూవివాదాన్ని ఆసరాగా చేసుకుని బొత్స సందీప్ తదితరులు ఫోర్జరీ పత్రాలను సృష్టించి సదరు భూములను తమ పేరిట మార్చుకున్నారని పేర్కొన్నారు. 2018-19లో జరిగిన ఈ అక్రమ వ్యవహారంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, పోలీసులు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ధర్మాసనం.. విచారణను జూన్ 5కు వాయిదా వేసింది.

కార్మికులకు 'చంద్రన్న బీమా': చంద్రబాబు

అమరావతి, మే1(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ చంద్రన్న బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటించారు. బుధవారం మేడే సందర్భంగా 'ఎక్స్'వేదికగా కార్మికులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'శ్రమదోపిడీని ఎదిరించి, శ్రమశక్తి గెలుపొందిన మహోజ్వల చారిత్రక దినం మేడే. తమ కష్టంతో ప్రగతి పూర్వక సమాజ నిర్మాణానికి చేయూతనిచ్చే శ్రామికుల హక్కులను కాపాడటంలో టీడీపీ ఎల్లప్పుడూ ముందుంటుంది. 2024 ఎన్నికల కూటమి మేనిఫెస్టోలో కూడా కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. డ్రైవర్లను ఓనర్లుగా చేసే లక్ష్యంతో వాహనాల కొనుగోలుకు రూ.4 లక్షల వరకు పొందే రుణాలపై 5% పైబడిన వడ్డీని సబ్సిడీగా ఇస్తాం. జీవో 21ను రద్దు చేసి, జరిమానాల భారం తగ్గిస్తాం. జగన్ సర్కార్ పెంచిన గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించడానికి చర్యలు తీసుకుంటామ'ని చంద్రబాబు హామీ ఇచ్చారు. కాగా ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా టీడీపీ యువనేత నారా లోకేశ్ కార్మికులకు 'ఎక్స్' వేదికగా మేడే శుభాకాంక్షలు తెలిపారు.

పెంపు సరే.. అసలు జీతాలే ఇవ్వట్లేదు!

» వైసీపీ సమావేశంలో పారిశుధ్య కార్మికుల కేకలు

విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవం మేడే రోజున వైసీపీ నాయకులకు ఎదురుదెబ్బ తగిలింది. జీవీఎంసీ వర్కర్స్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు మే డే సందర్భంగా రైల్వే న్యూకాలనీలో బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ టీడీపీ హయాంలో పారిశుధ్య కార్మికులకు పెద్దగా వేతనాలు ఇవ్వలేదని, వైసీపీ వచ్చాక కొద్దిగా పెంచామని, ఈసారి గెలిపిస్తే ఒక్కొక్కరికి రూ.25 వేల జీతం ఇస్తామని చెప్పారు. ఈలోగా కార్మికులంతా 'మాకు రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదు' అంటూ కేకలు వేశారు. సూపర్‌వైజర్లకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వలేదని మరికొందరు గోల చేశారు.

తోట త్రిమూర్తులు అప్పీలుపై విచారణ 7న

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): దళిత యువకులకు శిరోముండనం చేసిన ఘటనలో బాధితులను ప్రతివాదులుగా చేరుస్తూ వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతర దోషులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అప్పీళ్లపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే దాఖలు చేసుకోవాలని బాధితులకు సూచించింది. విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఘటనలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో ఎనిమిది మందిని దోషులుగా నిర్ధారించి విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు వారికి 18 నెలల జైలుశిక్షతో పాటు రూ.42వేలు జరిమానా విధించింది.

రాజీనామా చేసి వైసీపీ కండువాతో రండి

» వలంటీర్లకు టెక్కలి అభ్యర్థి దువ్వాడ వార్నింగ్

టెక్కలి, మే 1: వలంటీర్లు రాజీనామా చేసి పార్టీ కండువా కప్పుకున్న వారిని మాత్రమే జూన్ 5 నుంచి మళ్లీ కొనసాగిస్తామని టెక్కలి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'రాజీనామా చేయకుండా, వైసీపీ కండువా వేసుకోకుండా ఉన్న వలంటీరు మాటలు మేము విననవసరం లేదు. జూన్ 5 తరువాత ఆ వలంటీర్ ఉండడు. రాజీనామా చేయని వారు ఉంటే వెంటనే రాజీనామాలు చేయాల్సిందే. 3వ తేదీ నాటికి రాజీనామా చేయలేదని తెలిస్తే వారు మాకు అక్కర్లేదు. ప్రచారంలో వలంటీర్లు ఎక్కడా తగ్గకూడదు. 13వ తేదీ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం అయ్యేసరికి మీ పని మీరు చేయాల్సిందే' అని హుకుం జారీ చేశారు.

నిధులు విడుదల చేయకుండా వేధింపులు

» ఏపీ పంచాయతీ పరిషత్, సర్పంచుల సంక్షేమ సంఘం నేతలు

అమరావతి/మంగళగిరి, మే 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల నిధులు రూ.998.84 కోట్లను కేంద్రం విడుదల చేసి నెల రోజులైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను మంజూరు చేయకుండా వేధింపులకు గురిచేస్తోందని ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ఆరోపించారు. బుధవారం తాడేపల్లిలోని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యాలయం వద్ద సర్పంచులు ఆందోళన నిర్వహించారు. అనంతరం అదనపు కమిషనర్ ఎం.సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. పాపారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీలు సమస్యలతో సతమతమవుతున్నాయని చెప్పారు. ఏపీ పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్రం మార్చి 28న నిధులను జమ చేసిందన్నారు. ఈ విషయమై ఏప్రిల్ 12న కమిషనర్‌కు, 13న రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

లక్ష విదేశీ ఉద్యోగాలు!

» తెలుగుదేశం హామీ.. ఎన్ఆర్ఐ టీడీపీ తోడ్పాటు

» చంద్రబాబు గెలుపు కోసం ప్రచారానికి చలో ఆంధ్రప్రదేశ్

» ఏసీ గదుల నుంచి మండే ఎండల్లోకి ప్రవాసులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరఫున ప్రచారం నిర్వహిస్తున్న ఎన్నారై టీడీపీ బృందం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కురుక్షేత్రం పట్ల విదేశాలలోని ప్రవాసులు అత్యంత ఆసక్తి కనబర్చడమే కాకుండా తమకు వీలైన విధంగా రాష్ట్రాన్ని రక్షించేందుకు ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతున్నారు. మాతృభూమిపై మమకారంతో స్వదేశానికి వచ్చి నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వారు కొందరైతే, విదేశాలలో ఉద్యోగాలు చేసుకుంటూనే తమ స్వస్థలాలలో నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయండంటూ ప్రచారం చేసే వారు అత్యధికులు ఉన్నారు. వీరిలో సింహభాగం తెలుగుదేశం పార్టీ అభిమానులే ఉండటం గమనార్హం. తెలుగునాట ఏ రాజకీయ పార్టీకీ లేని విధంగా పెద్ద సంఖ్యలో విదేశాలలోని అభిమానులు ఉద్యోగాలకు సెలవు పెట్టి, వ్యాపారాలకు తాత్కాలిక విరామం ఇచ్చి మరీ టీడీపీ పక్షాన ప్రచారం చేయడానికి విమానాలెక్కుతున్నారు. ప్రపంచంలో అత్యధికంగా పెట్రోలు ఉత్పత్తి చేసే సౌదీ ఆరంకో కాంట్రాక్టింగ్ చేసే రావి రాధాకృష్ణ, ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసే బి.వెంకట రాంకిశోర్, అమెరికాలో వ్యాపారం చేసే మల్లిక్ మడేరమట్ల తరహా దాదాపు 1500 మంది మాతృదేశం బాట పట్టారు. కొందరు ఇప్పటికే స్వదేశానికి చేరుకొని వివిధ నియోజకవర్గాలలో ప్రచారం చేస్తుండగా, మరికొందరు విమాన టికెట్లను బుక్ చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకూ ఎన్నారై తెలుగుదేశం బృందాలు ఇప్పటికే చేరుకున్నాయి. విదేశాలలో ఏసీ గదుల్లో విలాసవంతమైన జీవితాన్ని అనుభవించే వీరు ఆంధ్రప్రదేశ్‌లో మండే ఎండల్లో చెమటోడ్చుతూ చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడుతున్నారు. ఎన్నారైల ప్రచార తీరును తెలుగుదేశం అధినేత చంద్రబాబు, లోకేశ్ కూడా గమనిస్తున్నట్లు సమాచారం. మంగళగిరిలో పార్టీ ఏర్పాటు చేసిన వార్ రూంలో ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు వేమూరి రవి కీలక పాత్ర పోషిస్తున్నారు. నిరుద్యోగ సమస్య కీలకాంశం కావడంతో విదేశాలలో తెలుగు యువతకు లక్ష ఉద్యోగాలు ఇస్తామంటూ టీడీపీ ఇచ్చిన హామీ ఆసక్తి కలిగిస్తోంది. విదేశాలలో టీడీపీకి అంకితభావంతో పని చేసే వారు భారీగా ఉండగా, అందులో కొన్ని వేల మంది వ్యాపారవేత్తలున్నారు. వీరిలో కనీసం 5 వేల మంది తమ సంస్థల్లో సంవత్సరానికి కనీసం ఐదుగురికి చొప్పున ఐదేళ్ల కాలంలో 20 మందికి ఉపాధి కల్పిస్తే సునాయాసంగా లక్ష మందికి ఉద్యోగావకాశాలు కల్పించగలుగుతామని తెలుగుదేశం నాయకులు పేర్కొంటున్నారు. విదేశాలలో ఉపాధి కల్పనకు దోహదపడే విధంగా తెలుగుదేశం పార్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను చాలా కాలంగా నిర్వహిస్తోందని ఆ పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ గుర్తుచేస్తూ.. లక్ష కంటే ఎక్కువ ఉద్యోగాలే ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. భారీ సంఖ్యలో తెలుగు విద్యార్థులు విదేశాలలో ఉంటున్నా, వారికి సరైన మార్గదర్శకం లేదా సహాయం అందించే వ్యవస్థ కరువైందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రత్యేక సహాయక కేంద్రాలను నెలకొల్పనున్నట్లు ఆయన వెల్లడించారు.

కడప కోర్టు.. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించింది

» బాధితుడు కాని వ్యక్తి పిటిషన్ ఎలా వేస్తారు?

» షర్మిల, సునీతల తరఫు న్యాయవాదుల వాదన

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): "కడప కోర్టు వాక్ స్వాతంత్ర్యాన్ని హరించింది. బాధితుడు కాని వ్యక్తి వివేకా కేసు విషయంలో పిటిషన్ ఎలా వేస్తారు. దీనిని కొట్టివేయండి" అని పిటిషనర్లు వైఎస్ షర్మిల, సునీత తరఫు న్యాయవాదులు హైకోర్టును అభ్యర్థించారు. వివేకా హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టు ముందు ఉంచాలనుకుంటున్న లీగల్ సబ్ మిషన్స్(న్యాయపరమైన అంశాలు)ను ఒకరికి ఒకరు మార్చుకోవాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు, కడప కోర్టులో పిటిషన్ వేసిన సురేశ్‌బాబు తరఫు న్యాయవాదికి కోర్టు స్పష్టం చేసింది. విచారణను శుక్రవారానికివాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ ఎన్. హరినాథ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. వివేకా హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ఏ కేసుల గురించి ప్రచారంలో మాట్లాడవద్దని కడప జిల్లా కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ షర్మిల, సునీత, టీడీపీ అభ్యర్థి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు, న్యాయవాది గూడపాటి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి స్పందిస్తూ.. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు.

మేనిఫెస్టో పక్కాగా అమలు చేయగలం

» దోపిడీ, దుబారా అరికడితే చాలా డబ్బు ఆదా: యనమల



అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితులతో సహా అన్నీ బేరీజు వేసుకొనే కూటమి తన మేనిఫెస్టోను ఖరారు చేసిందని, అది అమలు చేయగలిగిన మేనిఫెస్టో అని మాజీ ఆర్థిక మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తరహా దోపిడీని... దుబారాను అరికడితే వేల కోట్ల రూపాయలు ఆదా అవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన ఇక్కడ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని వినాశనం నుంచి అభివృద్ధి దిశగా తీసుకువెళ్లే ప్రయత్నాన్ని ఈ మేనిఫెస్టో ద్వారా చేశామని, అన్ని రంగాలు... అన్ని వర్గాలకూ సముచిత ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. 'రాష్ట్రంలోని సహజ వనరులను దోచుకొని జేబులు నింపుకోవడానికి జగన్ ప్రయత్నించారు తప్ప ఖజానాకు ఆదాయం పెంచాలని, ప్రజలకు ఉపయోగపడాలని కోరుకోలేదు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో లభ్యమైన ఇసుకలో తొంభై శాతాన్ని ఆయన దోచుకొని జేబులు నింపుకొన్నారు. పది శాతం మాత్రమే అధికారికంగా విక్రయించారు. మేం ఈ దోపిడీకి కళ్లెం వేసేలా సమగ్ర విధానాన్ని తెస్తాం. జగన్ ప్రభుత్వంలో దుబారాకు అంతే లేదు. వైసీపీ రంగులు వేయడానికి... తీయడానికి రూ.3వేల కోట్లు తగలేశారు. పదుల సంఖ్యలో సలహాదారులను పెట్టి వారి జీతభత్యాలకు, వైభోగాలకు వందల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ దుబారాను అరికడితే ప్రభుత్వానికి ఏటా రూ. రెండు మూడు వేల కోట్లు మిగులుతాయి. జగన్ హయాంలో పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయం రెండూ పెరగలేదు. జగన్ వ్యక్తిగత ఆదాయం మాత్రం పెరిగింది. వాణిజ్య పన్నుల్లో కోర్టు స్టేల కింద రూ. పది వేల కోట్ల ఆదాయం ఇరుక్కుపోయింది' అని ఆయన వివరించారు.

పన్నులు పెంచకుండా మేనిఫెస్టో అమలు

మేనిఫెస్టో అమలు కోసం కొత్తగా ఏ పన్నులూ పెంచబోమని యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. జీఎస్టీ విధానం వచ్చిన తర్వాత పన్నులు పెంచడం రాష్ట్రాల చేతుల్లో లేదని, కేంద్రంలోని జీఎస్టీ కౌన్సిల్ ఆమోదంతోనే మొత్తం దేశమంతా పెంచాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. 'మద్యం, పెట్రోలు, డీజిల్ వంటి మూడు నాలుగు అంశాలపై మాత్రమే రాష్ట్రాలకు అధికారం ఉంది. చెత్త పన్ను, ఆస్తి పన్ను వంటివి పాలనా రుసుముల కిందకు వస్తాయి. అవి రాష్ట్ర ప్రభుత్వానికి రావు. స్థానిక సంస్థలకు వెళ్తాయి. జగన్ ప్రభుత్వం వాటిని కొత్తగా వేసి తర్వాత స్థానిక సంస్థల నుంచి ఆ డబ్బును బలవంతంగా గుంజుకొంది. మేం అలా చేయం. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే పన్ను వాటా 41 శాతం నుంచి 40 శాతానికి తగ్గించారు. జగన్ ప్రభుత్వం దాని గురించి కూడా అడగలేకపోయింది. ఆ ఒక్క శాతం తిరిగి పెంచేలా చేయగలిగినా అదనంగా రూ. రెండు మూడు వేల కోట్లు వస్తాయి. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రాష్ట్రం వృద్ధి రేటు పది శాతం ఉంది. ఇప్పుడు అది మూడు నాలుగు శాతానికి పడిపోయింది. పాలనలో మాకు అనుభవం ఉంది. మేం ప్రజలను హింస పెట్టకుండా ఆదాయాన్ని పెంచాం. అభివృద్ధిని చూపించాం. పేద ప్రజలను ఆదుకొన్నాం' అని ఆయన వివరించారు.



మంగళగిరిలోని పై కేర్ డేటా సెంటర్‌లో ఉద్యోగులతో బ్రాహ్మణి సెల్ఫీ

టీడీపీతోనే మహిళా సాధికారత

» ఈ ఎన్నికల్లో 'స్త్రీశక్తి'ని చూపించండి: బ్రాహ్మణి

హిందూపురం, మే 1: తెలుగుదేశం పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి అన్నారు. ఈ ఎన్నికల్లో 'స్త్రీశక్తి' సత్తా ఏమిటో చూపించాలని కోరారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని జేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం స్త్రీశక్తి మహిళా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి, నారా బ్రాహ్మణి, తేజస్విని హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ.. మహిళల కోసం ఎన్టీఆర్ ఎన్నో విప్లవాత్మక పథకాలు తీసుకొచ్చారన్నారని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు మహిళలకు స్థానికసంస్థల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. టీడీపీ హయాంలో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయన్నారు. చంద్రబాబు ప్రారంభించిన డ్వాక్రా సంఘం నేడు విస్తరించిందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు కూడా మహిళలకు అండగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి అభివృద్ధి చేసే చంద్రబాబుకు ఓటేయాలని సూచించారు.

జగన్ మళ్లీ గెలిస్తే ఎవరి భూమీ మిగలదు: శివాజీ

చిలకలూరిపేట అర్బన్, మే 1: జగన్ మరోసారి సీఎం అయితే రాష్ట్రంలో ఎవరి భూములనూ మిగలనివ్వరని సినీనటుడు శివాజీ హెచ్చరించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడిలో మంగళవారం రాత్రి కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావుకు మద్దతుగా శివాజీ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్-6 పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చింది మొదలు రాష్ట్రంలో ఎక్కడెక్కడ భూములు ఉన్నాయి? వాటిని ఎలా కబ్జా చేయాలి? అన్న దానిపైనే దృష్టి పెట్టారని అన్నారు. భూరక్ష పేరుతో సర్వే చేసి భూముల వివరాలు తెలుసుకున్నారని, ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా వాటికి ఎసరు పెట్టే పని మొదలు పెట్టారని ఆరోపించారు. యువత కలలు సాకారం కావాలంటే చంద్రబాబు నాయకత్వంతోనే సాధ్యమన్నారు.

ఫ్యానుకు ఓటేస్తే.. ఉరి వేసుకున్నట్లే: డీఎల్

ఖాజీపేట, మే 1: వైసీపీ ఎన్నికల గుర్తు ఫ్యానుకు ఓటేస్తే ఉరి వేసుకున్నట్లేనని మాజీమంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేటలో బుధవారం నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ తన 45ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి దరిద్రపు ముఖ్యమంత్రిని చూడలేదన్నారు. ఇలాంటి వ్యక్తికి ఓటు వేస్తే కష్టాలు కోరి తెచ్చుకున్నట్లేనని అన్నారు. పాస్ పుస్తకాలపై ఫొటోలు వేసుకుని పిచ్చి ఆనందం పొందుతున్నాడని, దీనిపై భారతిని రైతులు నిలదీస్తే సమాధానం లేదన్నారు. జగన్‌కు పిచ్చి పరాకాష్ఠకు చేరిందని, ఇలాంటి వ్యక్తికి ఓటు వేయకండి అని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు.

క్షీణించిన దళిత మహిళ ఆరోగ్యం

» బొటనవేలు నరుక్కున్న మహిళ పరిస్థితి విషమం

» ఐదు రోజులుగా గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష

» స్పందించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



ఆమరణ దీక్షలో నీరసించిన కోపూరి లక్ష్మి

గుంటూరు, మే 1: ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న అరాచకాలు, అక్రమాలపై గల్లీ నుంచి ఢిల్లీ వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టిన దళిత మహిళ, ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరు లక్ష్మి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఐదు రోజులుగా ఆమె గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను నిరసిస్తూ ఆమె ఇటీవల దేశ రాజధాని న్యూఢిల్లీలో బొటనవేలును నరుక్కొని నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాల్లో ఆమె వినతి పత్రాలు అందించారు. ఆ తర్వాత గుంటూరు చేరుకొని కృష్ణ తులసి నగర్‌లో ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఆమె దీక్ష ప్రారంభించి బుధవారం నాటికి ఐదు రోజులు పూర్తయింది. దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. బొటనవేలు నరుకున్న అనంతరం ఆమె ఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆ తర్వాత నుంచి కనీసం ట్యాబ్లెట్లు కూడా వాడకుండా ఆమరణ నిరాహార దీక్ష చేస్తుండటంతో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. బుధవారం నిరాహార దీక్ష శిబిరం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేలునరుక్కున్నా, ప్రాణాలకు తెగించి ఆమరణ నిరాహారదీక్షకు దిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించే క్రమంలో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధమన్నారు. భూకబ్జాలు, ఫోర్జరీ సంతకాలతో భూదందాలు సాగిస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు, హత్యలకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. త్వరలో రాష్ట్రానికి వస్తున్న మోదీని కలిసేందుకు అవకాశం కల్పించాలని ఆమె మీడియా ముఖంగా వేడుకున్నారు.

స్టీల్ ప్లాంటు ఉద్యోగులకు అందని జీతాలు

» మార్చి నెల వేతనాలు 50 శాతమే పంపిణీ

విశాఖపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు అధికారులు, కార్మికులకు ఏప్రిల్ నెల జీతాలు అందలేదు. సాధారణంగా ఒకటో తేదీ రాక ముందే నెలాఖరునే బ్యాంకు ఖాతాల్లో జమ చేసేస్తారు. గత ఆర్నెల్లుగా ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో జీతాలు చాలా ఆలస్యమవుతున్నాయి. అధికారులకు మార్చి నెల జీతాలు 50 శాతమే ఇచ్చారు. అవి కూడా 14వ తేదీ దాటిన తరువాత ఖాతాలకు జమ చేశారు. మిగిలిన 50 శాతం ఇప్పటివరకూ ఇవ్వలేదు. ఇప్పుడు మళ్లీ ఏప్రిల్ జీతాలు ఇవ్వాల్సి ఉంది. కార్మికులు, ఉద్యోగులు, అధికారులు అందరికీ కలిపి జీతాల కోసం నెలకు రూ.86 కోట్లు అవసరం.

భారీగా పడిపోయిన ఉత్పత్తి

అదానీ గంగవరం పోర్టులో నిర్వాసిత కార్మికుల సమ్మె వల్ల గత 20 రోజులుగా బొగ్గు సరఫరా నిలిచిపోయింది. దాంతో స్టీల్‌ప్లాంటులో కోక్ ఓవెన్లు, బ్లాస్ట్ ఫర్నేసులు పాడైపోకుండా నామమాత్రపు ఉత్పత్తితో నడిపిస్తున్నారు. రోజుకు 20 వేల టన్నులకు పైగా ఉత్పత్తి రావలసి ఉండగా సగటున ఐదు వేల టన్నులే ఉత్పత్తి జరుగుతోంది. మరోవైపు విద్యుత్ బిల్లు నెలకు రూ.90 కోట్ల వరకు వస్తోంది. ఏ నెల బిల్లు ఆ నెల చెల్లించకపోతే సరఫరా నిలిపివేస్తామంటూ ఈపీడీసీఎల్ అధికారులు బెదిరిస్తున్నారు. కాగా, విశాఖ స్టీల్‌ప్లాంటుకు బ్యాంకులు కూడా సహకరించడం లేదని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి, డి.ఆదినారాయణ అన్నారు. ఇటీవల రాయబరేలిలో ఉన్న ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంటు అమ్మకం ద్వారా రూ.750 కోట్లు వచ్చాయి. వాటి వినియోగానికి 'ఉక్కు' యాజమాన్యం ప్రయత్నించగా, బ్యాంకులు అంగీకరించడం లేదన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి ఇంటిపై దాడి

» కిటికీల అద్దాలు... కారు అద్దాలు ధ్వంసం

» ఇంట్లో యాసిడ్ పోసేందుకు ప్రయత్నం

» ఆ సమయంలో స్థానిక పోలీసులకు ఫోన్

» నిర్లక్ష్య సమాధానంతో మదనపల్లె డీఎస్పీకి ఫిర్యాదు

» మంత్రి పెద్దిరెడ్డి వేధిస్తున్నారని వెల్లడి

» ఇటీవల వైసీపీ నాయకులపై కేసుపెట్టిన రామకృష్ణ



ధ్వంసమైన జడ్జి రామకృష్ణ ఇంటి కిటికీ అద్దాలు

ఆస్తి తగాదాలతోనే దాడి

బి.కొత్తకోటలో జడ్జి రామకృష్ణ నివాసంపై దాడిచేసిన వ్యక్తి ఆయన తమ్ముడు రామచంద్ర. ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదు. అన్నదమ్ములిద్దరికీ ఆస్తి తగాదాలు ఉన్నాయి. దీంతో మంగళవారం రాత్రి రామచంద్ర కిటికీ అద్దాలు, కారు అద్దాలు ధ్వంసం చేశాడు. జడ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. - సూర్యనారాయణ, బి.కొత్తకోట సీఐ

రాయచోటి, మే 1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట పట్టణంలో నివాసం ఉంటున్న జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ ఇంటిపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇంటి వెనుక వైపు కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. కిటికీలకు అమర్చిన మెష్‌ను పీకి పక్కన పడేశారు. ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటన బుధవారం ఉదయం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై జడ్జి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వైసీపీ నాయకులపై తాను క్రిమినల్ కేసు పెట్టానని, తనను భయపెట్టి కేసులను ఉపసంహరింపజేసేందుకు వారు గూండాలను ఇంటిపై పంపించారని అన్నారు. పదేళ్లుగా తనకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మధ్య అనేక సంఘటనలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మరోసారి దాడి జరిగిందన్నారు. దుండగులు కిటికీల అద్దాలు పగులగొట్టి యాసిడ్‌ను లోపలికి చల్లేందుకు ప్రయత్నించారని, తనతో పాటు, కుటుంబసభ్యులను హతమార్చేందుకు ప్రయత్నం జరిగిందని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని అన్నారు. దుండగులు దాడికి యత్నిస్తున్న సమయంలో స్థానిక పోలీసులకు ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, దీంతో మదనపల్లె డీఎస్పీకి ఫోన్ చేయగా రాత్రి ఇద్దరు పోలీసులను పంపారన్నారు. బయటకు వచ్చి చూడగా తన కారు సైతం ధ్వంసం అయిందన్నారు. తమ ఇంటిపై ఎవరు దాడి చేయించారనే విషయంలో పోలీసులు స్పందించడం లేదని ఆరోపించారు. జగన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనను చాలా విధాలుగా వేధిస్తున్నారన్నారు. ఇటీవల తాను వైసీపీ నాయకులపై బి.కొత్తకోటలో ఓ క్రిమినల్ కేసు పెట్టానని, ఆ కేసును రిజిస్టర్ చేయకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. తన నివాసంపై దాడి జరిగిందని, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులను ఖండించాలని అన్నారు.

అనంతలో టార్గెట్ టీడీపీ!

» వైసీపీ నేతపై దాడి.. టీడీపీ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు

అనంతపురం అర్బన్/క్రైం, మే 1: అనంతపురం జిల్లా కేంద్రంలో వైసీపీ నేత నగేశ్‌పై జరిగిన దాడిని అదునుగా చేసుకుని పోలీసులు టీడీపీ కీలక నాయకులను టార్గెట్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయరాంనాయుడును మంగళవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని రామకృష్ణ కాలనీలో ఎంపీటీసీ భర్త నగేశ్‌పై మంగళవారం దాడి జరిగింది. ఆయన కళ్లలో కారంకొట్టి కొందరు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు జయరాం నాయుడు సహా 14మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అర్ధరాత్రి సమయంలో జయరాంనాయుడును అదుపులోకి తీసుకుని వివిధ స్టేషన్ల చుట్టూ తిప్పారు. బుధవారం ఉదయం అనంతపురం త్రీటౌన్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విషయం తెలియగానే అనంతపురం అర్బన్ నియోజకవర్గం కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టీడీపీ నేతలు, కార్యకర్తలు స్టేషన్ ముందు నిరసన తెలిపారు. వారం రోజులుగా డీఎస్పీ, కొందరు సీఐలు టీడీపీ నాయకులు, కార్యకర్తల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని కూటమి అభ్యర్థి దగ్గుబాటి, వెంకటశివుడు యాదవ్ ఆరోపించారు. అనంతపురం అర్బన్ సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డికి తొత్తుగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేత నగేశ్‌పై వ్యక్తిగత సమస్యల కారణంగా దాడి జరిగిందని, ఆ ఘటనతో టీడీపీ నేత జయరాంనాయుడుకు సంబంధం లేదన్నారు. అయినప్పటికీ.. ఎమ్మెల్యే, డీఎస్పీ కలిసి ఆయనపై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడు, ఐపీఎస్ అధికారి రవికుమార్‌ను కలిశారు. జయరాంనాయుడు అక్రమ అరెస్టు గురించి ఫిర్యాదు చేశారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డితోపాటు పలువురు సీఐలను సస్పెండ్ చేయాలని కోరారు. డీఎస్పీ కొనసాగితే సజావుగా ఎన్నికలు జరగనివ్వరని తెలిపారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. కాగా, రామకృష్ణ కాలనీలో నగేశ్‌పై జరిగిన దాడి ఘటనలో సంబంధం లేనివారిని సైతం కేసులో ఇరికించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. "వైసీపీ కార్పొరేటర్ హరిత, ఆమె భర్త జయరాం, కార్పొరేటర్ బాబా ఫకృద్దీన్ పలువురు కార్యకర్తలతో కలిసి ఇటీవల టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ నాయకులు వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. దాడి జరిగినచోట జయరాం లేకపోయినా.. కేసులో ఆయన పేరు చేర్చారు. చివరికి ఆయన భార్య, కార్పొరేటర్ హరిత పేరును సైతం కేసులో చేర్చారు. నిందితులలో 80 శాతం మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరినవారే ఉన్నారు" అని టీడీపీ నేతలు తెలిపారు.